Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU




అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 321 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శనివారం, 8 - 8 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం: 2015

# చేనేతలకు మేలు చేసేది... అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమే

## - 12వ జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం చంద్రబాబు - చీరాలలో నేతన్న సేవలో పథకం ప్రారంభం
## - కుటుంబానికి రూ.25 వేలు చొప్పున 71,536 కుటుంబాలకు రూ. 179 కోట్లు జమ చేసిన సీఎం చంద్రబాబు






**చీరాల, (రాజధాని వార్తలు):** బీసీల సంరక్షణను చేపట్టే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని...దీనికోసం త్వరలోనే చట్టం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. బీసీ సంరక్షణ చట్టం కోసం ముసాయిదా సిద్దమైందని వెల్లడించారు. శుక్రవారం 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గంలోని కొత్తపేట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నేతన్న సేవలో సంక్షేమ పథకాన్ని సీఎం ప్రారంభించారు. రాష్ట్రంలోని అర్హులైన చేనేత కుటుంబాలకు రూ.7 25 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని సీఎం అందించారు. మొత్తంగా 71,536 చేనేత కుటుంబాలకు రూ.179 కోట్లను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. అలాగే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నా... రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం-అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదని ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతిని అడ్డుకునేలా జరుగుతున్న కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తతో ఉండాలని సూచించారు. ఇలాంటి వారి విషయంలో ప్రభుత్వం కఠినంగా8 ఉంటుందని... ప్రజలు కూడా కుట్రలు పన్నే వారి నైజాన్ని గమనించాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకునేలా ఆగస్ట్ 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఇది మరపురాని రోజుగా ఉండాలనే నేతన్న సేవలో...పథకాన్ని ప్రారంభించాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాదు... చెప్పని వాటినీ అమలు చేస్తున్నామనడానికి నేతన్న సేవలో పథకమే నిదర్శనం.8 చేనేత కేవలం ఒక వృత్తే కాదు... భారతీయ సంస్కృతికి ప్రతీక. దేశం గర్వించే కళ చేనేత. మన రాష్ట్రం అనేక చేనేత కళలకు నిలయం. అలాంటి వర్గానికి ఆసరాగా ఉంటున్నాం. చీరాల, వెంకటగిరి, ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, పొందూరు, పెడన, శ్రీకాళహస్తి, నరసాపురం... ఇలా రాష్ట్రంలో అనేక చేనేత ఉత్పత్తులు విశిష్ట గుర్తింపు పొందాయి. 1.27 లక్షల మంది చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. నేతన్న సేవ పథకమే కాదు... ఇప్పటికే నేతన్నలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లకు ప్రయోజనం కలుగుతోంది. చేనేతలకు 50 ఏళ్లకే ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పెన్షన్ అందిస్తున్నాం. 85 వేల మంది చేనేతలకు ఫించన్‌గా రూ.4 వేల చొప్పున నెలకు రూ.35 కోట్లు ఇస్తున్నాం. రూ.420 కోట్లు ఏడాదికి ఖర్చు పెడుతున్నాం. రాష్ట్రంలోని 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ద్వారా రూ.79 కోట్లు ఇచ్చాం. స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద రూ.10 కోట్ల వ్యయంతో 10 చేనేత క్లస్టర్లకు ఆమోదం పొందాయి. హ్యాండ్లూమ్ మార్కెటింగ్ అసిస్టెన్స్ కార్యక్రమంతో నేత కార్మికులకు నేరుగా మార్కెట్ అవకాశాలు వచ్చాయి. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేస్తున్నాం. అమరావతిలోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం కూడా వస్తోంది. విశాఖపట్నంలో రూ.4,200 కోట్ల పెట్టుబడితో సుస్థిర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుంది."అని సీఎం చంద్రబాబు అన్నారు.

# ఆయుష్ శాఖ దుష్ప్రవర్తనపై తక్షణ ఉన్నత స్థాయి విచారణ, వెంటనే పాలక మండలి ఏర్పాటు చేయాలని ఎన్ఎంఏ డిమాండ్

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆయుష్ శాఖలో కార్యాలయ వేధింపులు, అవినీతి, పరిపాలనా లోపాలకు సంబంధించిన తీవ్రమైన ఆరోపణలపై స్వతంత్ర, ఉన్నత స్థాయి విచారణ ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ జాతీయ వైద్య సంఘం (ఎన్ఎంఏ) రాష్ట్ర ప్రభుత్వానికి తక్షణ డిమాండ్ జారీ చేసింది. శాఖ అధికారి డాక్టర్ ఝాన్సీ లక్ష్మి చేసిన బహిరంగ ప్రకటనల నేపథ్యంలో ఈ డిమాండ్ వచ్చింది. ఈ ఆరోపణలు మొత్తం ఆయుష్ శాఖ సమగ్రత, పారదర్శకత, ప్రజా విశ్వాసానికి ముప్పు కలిగిస్తున్నాయని ఎన్ఎంఏ నాయకత్వం నొక్కి చెబుతోంది. "ఈ సమస్యలు కేవలం ఒక ఉద్యోగికి మాత్రమే పరిమితం కావు," అని ఎన్ఎంఏ నాయకత్వం పేర్కొంది. "అక్రమాలను బయటపెట్టే విజిల్‌బ్లోయర్‌లకు ప్రభుత్వం గట్టిగా అండగా నిలబడాలి. విచారణ పూర్తయ్యేంత వరకు వారికి పూర్తి రక్షణ, న్యాయం అందేలా చూడాలి." తక్షణ పాలన, ఆర్థిక సంస్కరణలను కోరుతూ కీలక డిమాండ్లు. రాష్ట్ర ప్రభుత్వం, గౌరవనీయ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖల మంత్రి ఈ క్రింది తక్షణ చర్యలు తీసుకోవాలని ఎన్ఎంఏ కోరుతోంది.

స్వతంత్ర విచారణ:
డాక్టర్ ఝాన్సీ లక్ష్మి లేవనెత్తిన అన్ని ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, హోదాతో సంబంధం లేకుండా దోషులపై కఠినమైన చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకునేలా చూడాలి.

కౌన్సిల్ తక్షణ పాలన:
ఏప్రిల్ 2025 గెజిట్ నోటిఫికేషన్ ఉన్నప్పటికీ ఇంకా ఏర్పాటు కాని, కొత్తగా పేరు మార్చబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారతీయ వైద్య విధానం వైద్య మండలి కోసం తప్పనిసరి అయిన 13 మంది సభ్యుల పాలక మండలిని ఏర్పాటు చేయాలి.

సంస్థాగత స్వయంప్రతిపత్తి:
ప్రధాన ఆయుష్ శాఖ నుండి దాని కార్యకలాపాలను పూర్తిగా వేరు చేయడానికి, కౌన్సిల్ కోసం ఒక ప్రత్యేకమైన, అంకితమైన కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి.

సమగ్ర ఆర్థిక ఆడిట్:
గత మూడేళ్లుగా కౌన్సిల్ ఆదాయ వ్యయాలను సమీక్షించి, ఆ వివరాలను బహిరంగంగా ప్రచురించడానికి ఒక ప్రభుత్వ ఆడిటర్‌ను నియమించాలి.

నిధుల దుర్వినియోగంపై విచారణ:
శాఖాపరమైన సైనేజ్‌పై ఖర్చు చేసిన ?1.60 లక్షలు ఇంకా ఆన్‌లైన్ పోర్టల్ కేటాయింపుల కోసం ఉపయోగించిన ?10 లక్షలకు పైగా నిధులతో సహా, దారి మళ్లించిన నిధుల ఆరోపణలపై విచారణ జరపాలి.


వేధింపుల నుండి రక్షణ:
అధికారిక కౌన్సిల్ ఫైళ్లను పరిశీలించడంలో పాలుపంచుకుంటున్న కౌన్సిల్ ఇన్‌స్పెక్టర్‌తో సహా సిబ్బందిపై బెదిరింపుల చర్యలను నిలిపివేయాలి. ఈ చర్యలు రాష్ట్రవ్యాప్తంగా ఆయుర్వేద పట్టభద్రులలో తీవ్ర ఆందోళనకు కారణమయ్యాయి. ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి, సంస్థాగత స్వయంప్రతిపత్తిని పరిరక్షించడానికి రాష్ట్ర ఆరోగ్య అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఎన్ఎంఏ పిలుపునిచ్చింది.

# తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో వరుణ యాగం.. ముహూర్తం ఫిక్స్

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి.. పాడి పంటలు సమృద్ధిగా పండి.. నదులు జలాశయాలు జలకళ సంతరించుకోవాలని ఆకాంక్షిస్తూ వరుణ యాగం నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు యాదగిరిగుట్టలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానానికి చెందని వేద పండితులు, అర్చకులు ఆగస్టు 10వ తేదీన ఈ యాగం నిర్వహించనున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ ప్రాంగణంలో ఈ యాగం వైభవంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. 108 మంది ఋత్వికులు, 11 హోమకుండాలు, వేదపండితులు, అర్చకులు ఈ యాగ క్రతువును నిర్వహిస్తారు. ఎల్ నినో ప్రభావం లేకుండా ఉండాలనే ప్రత్యేక సంకల్పంతో ఈ మహా యాగం నిర్వహిస్తారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఈ మహా వరుణ



యాగం నిర్వహించనున్నారు. పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొంటారు. కృష్ణా, గోదావరి నదులతోపాటు రైతాంగ శ్రేయస్సు, రాష్ట్రం సుభిక్షంగా ఉండడం కోసం ఈ వరుణ యాగం చేపడుతున్నట్లు యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి చైర్మన్ ఓ ప్రకటన విడుదల చేశారు.

# ఆగస్టు నెలలోనే వెలిగొండ ప్రాజెక్టుకు కృష్ణా జలాలు

**- పూర్తి కావొచ్చిన టిబిఎం తొలగింపు పనులు - రెండు విడతల్లో నిర్వాసితులకు 600 కోట్ల పరిహారం - మిగిలిన పనులు పూర్తి చేయడానికి యాక్షన్ ప్లాన్ - జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు**



**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఫ్లోరైడ్ బాధిత, వెనుకబడిన ప్రకాశం జిల్లాకు మూడు దశాబ్దాల కలగా ఉన్న వెలిగొండ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ ఆగస్టు కృష్ణానెలలోనే కృష్ణా జలాలు తీసుకెళ్ళేందుకు చర్యలు వేగవంతం చేసిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టును 2026 ఆగస్టు నాటికి పూర్తి చేయాలనే లక్ష్యాన్ని 2024లోనే నిర్దేశించుకున్నామని, ఆ లక్ష్యానికి అనుగుణంగా గత రెండేళ్లలో దాదాపు రూ. 3,000 కోట్లు వెచ్చించి రాత్రింబవళ్లు పనులు చేపట్టామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోని వివిధ పనులు 90 నుంచి 99 శాతం వరకు పూర్తయ్యాయని వెల్లడించారు. ప్రాజెక్టు లో మిగిలిన పనుల పురోగతిపై అధికారులు, ఏజెన్సీలతో శుక్రవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించి, నిర్ణీత గడువులోగా అన్ని పనులు పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించినట్లు మంత్రి తెలిపారు. టన్నెల్ పనులు శరవేగంగా కొల్లంవాగు నుంచి కృష్ణా జలాలు టన్నెల్‌కు చేరే అప్రోచ్ ఛానెల్ పనులు పూర్తయ్యాయని, హెడ్ రెగ్యులేటర్‌కు సంబంధించిన గేట్ల పనులు కూడా పూర్తి చేసినట్లు మంత్రి వెల్లడించారు. టన్నెల్-1, టన్నెల్-2లకు సంబంధించిన 286 మీటర్ల సిసి లైనింగ్ పనులను ఈ నెల 18వ తేదీలోగా పూర్తి చేసేలా, ఐదు గ్యాంట్రీలతో ప్రత్యేక షెడ్యూల్ రూపొందించినట్లు తెలిపారు. వెలిగొండ టన్నెల్‌లో ఉన్న 1,900 మెట్రిక్ టన్నుల బరువు, 175 మీటర్ల పొడవు కలిగిన ఎదీవీ మిషన్‌లో ఇప్పటికే 70 శాతం వరకు తొలగింపు పనులు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. మిగిలిన 30 శాతం పనులను కూడా రాబోయే 7 నుంచి 10 రోజుల్లో పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఐతే 5 ఏళ్ళ గొడ్డలి పార్టీ పాలనలో టిబిఎంను అంగుళం కూడా కదపలేదని, చుక్కనీరు కూడా బయటకు వెళ్ళే పరిస్థితి లేదని, అయినా కూడా జాతికి అంకితం పేరుతో ప్రజల్ని మోసం, దగా చేశారని దుయ్యబట్టారు.

**ఫీడర్ కెనాల్ పనుల్లో గణనీయమైన పురోగతి**

100 క్యూసెక్కుల నీరు వస్తేనే బండ్‌లు తెగిపోయే పరిస్థితి ఉన్న ఫీడర్ కెనాల్‌ను బలోపేతం చేసేలా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ. 460 కోట్లు మంజూరు చేసి, ఈ ఏడాది జనవరిలో పనులకు శంకుస్థాపన చేసినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే 5.3 కిలోమీటర్ల సీసీ వాల్ పనులు పూర్తయ్యాయని, మొత్తం 11 కిలోమీటర్ల లైనింగ్ పనులను 5 నెలల్లో పూర్తి చేసినట్లు చెప్పారు. ఫీడర్ కెనాల్‌కు సంబంధించిన ఈస్ట్రన్ మెయిన్ కెనాల్, సుంకేసుల, గొట్టిపడియ రెగ్యులేటర్ల పనులను ఈ నెల 15వ తేదీలోగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ప్రాజెక్టు పూర్తి చేయడానికి అత్యంత కీలకమైన నిర్వాసితులకు 900 కోట్ల పరిహారం ఇవ్వవలసి ఉండగా, ఒక్క నయా పైసా కూడా ఇవ్వకుండా, గత ప్రభుత్వం వారిని అత్యంత చులకనగా చూసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వెలిగొండ నిర్వాసితులకు అండగా నిలబడి, ఇప్పటికే 2,560 నిర్వాసిత కుటుంబాలకు రూ. 318 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. మిగిలిన 4,761 కుటుంబాలకు రూ. 600 కోట్లను రెండు విడతల్లో అందించనున్నట్లు తెలిపారు. మొదటి విడతగా రూ. 300 కోట్లు ఈ వారంలో, మరో రూ. 300 కోట్లు రాబోయే మూడు నుంచి నాలుగు వారాల్లో అందించేలా ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారని మంత్రి పేర్కొన్నారు.

**మాట నిలబెట్టుకుంటున్న కూటమి ప్రభుత్వం**

గత ఐదేళ్లలో నిలిచిపోయిన వెలిగొండ ప్రాజెక్టు పనులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వేగవంతం చేసిందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. నిధులు సమకూర్చడంతో పాటు నిర్వాసితులకు పరిహారం అందిస్తూ, టన్నెల్స్, ఫీడర్ కెనాల్, రెగ్యులేటర్ల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తున్నామని చెప్పారు. ఈ సమీక్షలో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, సలహాదారులు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహామూర్తి, సిఈ రమేష్ బాబు, ఎస్ఈ అబూతలేం మరియు ఈఈలు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మంగళగిరిలో నేటి నుంచి ఐసిఏఐ రెండు రోజుల ప్రాంతీయ సదస్సు

**మంగళగిరి, (రాజధాని వార్తలు):** ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా సదరన్ ఇండియా రీజనల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 58వ రీజినల్ కాన్ఫరెన్స్ మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో నేటి నుంచి రేపటి వరకు రెండు రోజుల పాటు జరగనుంది. ICAI గుంటూరు, విజయవాడ శాఖలు సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నాయి. సదస్సులో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ICAI దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. చార్టర్డ్ అకౌంటెంట్లపై ప్రజలు, బ్యాంకులు, పన్ను వసూలు చేసే సంస్థలకు ఉన్న విశ్వాసాన్ని ఆయన ప్రస్తావించారు. అనంతరం ICAI SIRC ఛైర్మన్ సుబ్బారావు ముప్పాళ్ల మాట్లాడుతూ, ప్రపంచంలోని పలు దేశాలు, ఖండాల్లో ICAI అంతర్జాతీయ సదస్సులు నిర్వహిస్తోందని, 140కి పైగా దేశాల్లో భారతీయ చార్టర్డ్ అకౌంటెంట్లు సేవలందిస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో సీఏలు ఈ సదస్సుకు హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ICAI అధ్యక్షుడు ప్రసన్న కుమార్ డి, ఉపాధ్యక్షుడు మంగేష్ కినారే, గుంటూరు బ్రాంచ్ ఛైర్మన్ భరద్వాజ్, విజయవాడ బ్రాంచ్ ఛైర్మన్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ చార్ట్ అమలులో నిర్లక్ష్యానికి ఆస్కారం ఇవ్వకూడదు

**- వృత్తి పట్ల నిబద్ధత ఉండాలి - క్రమశిక్షణతో పనిచేయాలి**

**- నూతన ఆయుష్ వైద్యులకు కమీషనర్ రోణంకి గోపాల్ కృష్ణ హితవు**




**విజయవాడ, (రాజధాని వార్తలు):** నూతనంగా విధుల్లో చేరిన ఆయుష్ వైద్యులు ప్రజాసేవనే పరమావధిగా భావించి, వృత్తిపట్ల పూర్తి నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాల్ కృష్ణ సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా సేవలందించడంతో పాటు ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. నేషనల్ ఆయుష్ మిషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఎంపికైన హోమియో, యునానీ వైద్యులకు విజయవాడ ఆటోనగర్‌లోని ఆయుష్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమం రెండో రోజు ఆయన మాట్లాడారు. నూతన వైద్యులకు విధులు, బాధ్యతలు, జాబ్ చార్ట్‌పై సమగ్ర అవగాహన కల్పించారు. ఆయుష్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు నిర్వహణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడం, ప్రజారోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయడం ప్రతి వైద్యుడి బాధ్యత అని చెప్పారు. జాబ్ చార్ట్‌లో నిర్దేశించిన విధులను తప్పనిసరిగా పాటిస్తూ, సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చాలని సూచించారు.

**ప్రజారోగ్య కార్యక్రమాలపై శిక్షణ**

శిక్షణలో భాగంగా నేషనల్ ఆయుష్ మిషన్ అమలు మార్గదర్శకాలు, అసాంక్రమిక వ్యాధుల స్క్రీనింగ్, ఆయుష్ హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ద్వారా నివేదికల నమోదు, ప్రజారోగ్య కార్యక్రమాల అమలు తదితర అంశాలపై అధికారులు, నిపుణులు నూతన వైద్యులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం మెడికల్ క్యాంప్ కిట్లను పంపిణీ చేశారు. మూడో రోజు శనివారం బడ్జెట్ కేటాయింపులు, ఆర్థిక నిర్వహణ, నేషనల్ ఆయుష్ మిషన్ పోర్టల్ నిర్వహణ, జిల్లా ఆయుష్ సొసైటీల సమన్వయంపై ప్రత్యేక సదస్సు నిర్వహించి శిక్షణ కార్యక్రమాన్ని ముగించనున్నారు.

# కూటమి పార్టీ నేతలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**- జర్నలిస్టులు అనేక ఇబ్బందులు పడుతున్నారు - ఇళ్ల స్థలాలు, పెన్షన్ సౌకర్యం, వెల్ఫేర్ ఫండ్, తదితర విషయాల్లో ప్రభుత్వం స్పందించాలి - ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి**







**మోపిదేవి, (రాజధాని వార్తలు):** మండల కేంద్రమైన మోపిదేవిలో స్వయంభుగా వేంచేసి ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానాన్ని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఏపీ ఎంపీఏ) రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ దర్శించుకున్నారు. అనంతరం మోపిదేవిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టులకు అనేక సమస్యలు ఉన్నాయని, ప్రభుత్వం వాటిని పరిష్కరించే దిశగా ఆలోచన చేయాలని ప్రభుత్వానికి కోరారు. తొలుత మోపిదేవిలో జర్నలిస్టుల సమస్యపై స్థానిక పాత్రికేయులతో మాట్లాడిన అనంతరం శ్రీరామ్ యాదవ్ మాట్లాడుతూ జర్నలిస్టులో ఇళ్ల స్థలాలు, జర్నలిస్టుల పెన్షన్ స్కీము, జర్నలిస్టుల వెల్ఫేర్ స్కీము చర్చించారు. ఈ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. పాలకుల అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా పాలకులకు ప్రజలకు అనుసంధానంగా ఉండే విలేకరులకు కనీస సౌకర్యాలు లేక అభద్రతాభావంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాత్రికేయులకు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గత ఎన్నికల్లో కూటమి నేతలు జర్నలిస్టులకు ఇచ్చిన హామీల ప్రకారం, జర్నలిస్టులు సమస్యలు పరిష్కరిస్తామని, ఇతర రాష్ట్రాల్లో ఉన్న జర్నలిస్టులకు ఇస్తున్న పెన్షన్ స్కీమును మన రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా పెన్షన్ అందిస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. గతంలో ఉన్న జర్నలిస్టులు వెల్ఫేర్ ఫండ్‌ను 50 కోట్లకు పెంచి పునరుదించాలని కోరారు. పాత్రికేయ మిత్రులు నిరంతరం 24 గంటలు ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నారని, కానీ వారు ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే విధంగా కృషి చేస్తున్నారని, ఇలాంటి పాత్రికేయులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికైనా పాత్రికేయ మిత్రుల సంక్షేమం గురించి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేసి జర్నలిస్టుల మిత్రుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. పాత్రికేయ మిత్రులకు భరోసా లేకపోవడం అత్యంత బాధాకరమన్నారు. ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ తరపున ఇప్పటికే ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు చేయటం జరిగిందని తెలిపారు. రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి, సమాచార శాఖ డైరెక్టర్‌కు, ఆరోగ్య శాఖ మంత్రితో సమస్యల మీద చర్చించడం జరిగింది. జర్నలిస్టుల హెల్త్ కార్డుల పైన కూడా చర్చించడం జరిగింది. రెండు లక్షల హెల్త్ కార్డు ప్రస్తుతం రెండు లక్షల వరకు మాత్రమే ఉంది. దానిని 25 లక్షల వరకు పెంచి, జర్నలిస్ట్ కుటుంబానికి ఆరోగ్య రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టుల భీమా సౌకర్యాన్ని పునర్ధించి, దానిని పది లక్షల నుంచి 20 లక్షలకు పెంచాలన్నారు. సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గతంలో హామీ ఇచ్చిన విధంగా ఇళ్ల స్థలాలు సమస్యను వెంటనే పరిష్కరించాలని, అలాగే ఇళ్ల నిర్మాణం పైన కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కూటమి నాయకులు చంద్రబాబు నాయుడు మరియు పవన్ కళ్యాణ్, మరియు బిజెపి పెద్దలు మీడియా మిత్రులకు భద్రతాభావం కల్పించండి. జర్నలిస్టు మిత్రులు మరింత నైపుణ్యంతో పని చేయడానికి అవకాశం ఇవ్వండి. పెన్షన్ స్కీము దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో అమలు అవుతుందని అందులో భాగంగా కూటమి ప్రభుత్వం కూడా గతంలో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని తెలిపారు. 20 సంవత్సరాలు దాటిన పాత్రికేయ మిత్రులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, అందుకు కమిటీని వేయాలని కోరారు. పెన్షన్ స్కీమును అమలు చేయాలని కోరుతున్నామని తెలిపారు. రైల్వే పాసులు జర్నలిస్టులకు నిలుపుదల చేశారని, కరోనా సమయంలో జర్నలిస్టుల రైల్వే పాస్‌లు నిలిపివేశారని, వాటిని మళ్లీ తిరిగి పునరుదించాలని కోరారు. లోక్‌సభలో ఎంపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. పాత్రికేయుల సమస్యల పరిష్కారం కోసం ఏపీ ఎంపీ కృషి చేస్తుందన్నారు. నవంబర్ 2 లోపల సమస్యలు పరిష్కారం కాకపోతే ఆందోళన రూపంలో జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని చాటే విధంగా సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా ఉద్యమ రూపంలోకి తీసుకెళ్తామని చెప్పారు. మోపిదేవి శ్రీ సుబ్రమణ్య స్వామివారి సాక్షిగా ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని, రాష్ట్రంలో ఉన్న జర్నలిస్ట్ సంఘాలు అందరూ ఐక్యంగా లేకపోతే మన జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కావని, అందరూ ఐక్యమత్యంగా ఉండి మన సమస్యలు మనమే పరిష్కరించుకోవాలని కోరారు. అన్ని సంఘాలకు విజ్ఞప్తి చేసి అన్ని సంఘాలను కలుపుకొని వెళ్లేలా కృషి చేస్తామని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కావాలంటే జర్నలిస్టు సంఘాలు ఇగోలు మరిచి ఐక్యతగా ఉండాలన్నారు. ఈ విధంగా ఉంటే సాధించలేని సమస్యలు ఏమీ ఉండవని తెలిపారు. నవంబర్ 2 నుండి జర్నలిస్టుల సమస్యపై పోరాటం చేస్తామని రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీధర్, జిల్లా జనరల్ సెక్రెటరీ కొండపల్లి శ్రీనివాస్ రావు, కృష్ణాజిల్లా సహాయ కార్యదర్శి ఉప్పాల మోహన్ కృష్ణ, కృష్ణాజిల్లా యూనియన్ గౌరవ సలహాదారు తలసిల నాగేశ్వరరావులతో పాటుగా మోపిదేవి మీడియా ప్రతినిధులు సిటీ కేబుల్ రిపోర్టర్ పిరాటి ఏసు తులసీరామ్, సాక్షి రిపోర్టర్ ఉప్పాల సుబ్బారావు, విశాలాంధ్ర రిపోర్టర్ మోపిదేవి రాఘవేంద్రరావు, మెగా నైన్ రిపోర్టర్ సామనపల్లి లక్ష్మణ్ బాబు, ఆంధ్రప్రభ రిపోర్టర్ కొండపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# జీఐ ట్యాగ్‌తో కుప్పడం పట్టుకు మరింత విశిష్టత

**- ఉచిత విద్యుత్తు, రూ.25 వేల ఆర్థిక సాయంతో ఊరట**

**- సీఎం చంద్రబాబుతో ముఖాముఖిలో చేనేత కుటుంబాలు**





**చీరాల, (రాజధాని వార్తలు):** వన్ డిస్ట్రిక్ట్-వన్ ప్రొడక్ట్ ద్వారా కుప్పడం పట్టు చీరలకు మరింత విశిష్టమైన గుర్తింపు లభించిందని, జీఐ ట్యాగ్‌తో అమ్మకాలు 30 శాతం మేర పెరిగాయని చేనేత కుటుంబాలు సీఎం చంద్రబాబుతో అన్నారు. గత ఏడాది చీరాలలో తయారైన కుప్పడం పట్టు తోపాటు అత్యుత్తమ వృత్తి నైపుణ్యానికి కేంద్ర ప్రభుత్వ అవార్డు దక్కడం గర్వకారణమన్నారు. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నేతన్న సేవలో పథకాన్ని చీరాల నియోజకవర్గం కొత్తపేటలో ప్రారంభించారు. కొత్తపేట గ్రామంలోని ఓ చేనేత మగ్గం యూనిట్‌ను ముఖ్యమంత్రి సందర్శించారు. చేనేత మగ్గం వద్దకు వచ్చిన ముఖ్యమంత్రికి చేనేత యూనిట్ యజమాని బండారు బాలసుబ్రహ్మణ్యం స్వాగతం పలికారు. అనంతరం చేనేత కార్మికులతో సీఎం మాట్లాడారు. కుప్పడం పట్టు చీరల ప్రత్యేకత, సంప్రదాయ నేత వృత్తి నైపుణ్యం, మార్కెట్ పరిస్థితులపై వారితో చర్చించారు.

**ప్రభుత్వ సాయం మాకు కొండంత అండ : చేనేత కార్మికులు**

చేనేతల జీవనోపాధి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై చేనేత వర్క్‌షాప్‌లోని కార్మికులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. వర్క్‌షాప్ ఏర్పాటుకు దారితీసిన ఆలోచన, యూనిట్ స్థాపన, ఎదురైన సవాళ్లు, వాటిని అధిగమించి తీర్చిదిద్దిన తీరు, యూనిట్‌ను సమర్థంగా నడిపిస్తున్న అంశాన్ని వారు సీఎంకు వివరించారు. ముందుగా కంచి బోర్డర్ చీరల తయారీదారు బత్తా ధనుంజయ రావుతో ముఖ్యమంత్రి మాట్లాడారు. కుటుంబ పరిస్థితులు, చేనేత వృత్తి, ఉత్పత్తి వ్యయం, ఆదాయం, మార్కెటింగ్, విక్రయాల గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఎంతో ఉపయోగపడుతోందని, రూ. 25 వేల ఆర్థిక సాయం తమకు ప్రోత్సాహంగా ఉంటుందని వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి బండారు బాలసుబ్రహ్మణ్యంతో కలిసి వర్క్‌షాప్ లోని తొలి అంతస్తును పరిశీలించారు.

భవనాన్ని విస్తరించి మరిన్ని మగ్గాలు ఏర్పాటు చేసి మరింత మంది చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలన్న ప్రణాళికలను ఆయన సీఎంకు వివరించారు. కోవిడ్ కారణంగా నిలిచిపోయిన విస్తరణ పనులను తిరిగి ప్రారంభించ నున్నట్లు తెలిపారు. అనంతరం వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న ఇతర చేనేత కార్మికులతో ముఖ్యమంత్రి ముచ్చటించారు. బొడ్డు అరుణ అనే మహిళ మగ్గంపై చీర నేస్తున్న తీరును సీఎం ఆసక్తిగా పరిశీలిం చారు. ప్రభుత్వం అందించిన రూ. 25 వేల ఆర్థిక సాయం తమ బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు మొబైల్ ఫోన్లలో వచ్చిన సంక్షిప్త సందేశాన్ని కార్మికులు ముఖ్యమంత్రికి చూపించారు. ప్రభుత్వ సహకారంతో తమ జీవనోపాధికి భరోసా లభించిందని చేనేతలు సంతోషం వ్యక్తం చేశారు.

# ఎల్నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలి : ఏపిసిఎన్ఎఫ్ సిఇఓ రామారావు

## - ఉప్పలపాడు, అభినేనిగుంట పాలెం గ్రామాల్లో రైతన్న మీకోసం - ప్రత్తిపాడులో పాల్గొన్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

**గుంటూరు, (రాజధాని వార్తలు):** ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో నెలకొన్న ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా రైతులు వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు పాటించాలని ఏపిసిఎన్ఎఫ్ సిఇఓ, మాజీ ఐఏఎస్ అధికారి రామారావు తెలిపారు. శుక్రవారం గుంటూరు జిల్లా పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామంలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రైతులు పంట సాగులో వ్యవసాయ, వాతావరణ శాఖ సూచనలు పాటించడం, పంట మార్పిడి అంతర్ పంటలు, తక్కువ నీరు అవసరమైన పంటలహౌహౌసాగు, ఫామ్ పాండ్స్, చెక్ డాములు ద్వారా వర్షపు నీటిని ఒడిసి పట్టి, భూగర్భ జలాలను పెంచుకోవటం, మట్టి పరీక్షల ఆధారంగా మాత్రమే ఎరువులు వాడకం, అలానే పెద్ద మొత్తంలో ప్రకృతి వ్యవసాయం చేయాలని రైతులకు వివరించారు, పిఎండిఎస్ కిట్స్, విత్తన గుళికలు, బీజామృతం లాంటి రసాయన రహిత పద్ధతులను అవలంబించి భూమి యొక్క సారాన్ని పెంచుకోవాలన్నారు. పొన్నూరు నియోజక వర్గ ప్రత్యేక అధికారిని గుంటూరు జిల్లా డిఆర్డిఏ పీడీ విజయలక్ష్మిహౌహౌమాట్లాడుతూ పంటల ప్రస్తుత పరిస్థితి, నీటి కొరత వలన పంటవాడిపోవడం లేదా ఎండిపోవటం, చీడపీడల ఉధృతి ఉద్యాన పంటల పరిస్థితి, బీడు లేదా సాగు చేయని భూముల వివరాలు వంటి అంశాలను సేకరించటం అలానే బీడుగా ఉన్న సాగు చేపట్టని పొలాల్లో స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలు వేయటం లేదా వర్షాభావ పరిస్థితి పరిణామాల వలన తీవ్రంగా దెబ్బతిన్న భూములలో మరల స్వల్పకాలిక రకాలను సాగుచేసే విధంగా ప్రోత్సహించటం, క్షేత్రస్థాయిలో గుర్తించిన కరువు పరిస్థితులకు తగువిధంగా నివారణ చర్యలు చేపట్టడం, అదేవిధంగాహౌహౌకార్యక్రమ పురోగతిని ఏపీ ఎయిమ్స్ 2.0 ద్వారా పారదర్శకంగా పర్యవేక్షించడం, ఫార్మర్ యాప్ ద్వారా రైతులకు అవసరమైన సలహాలు సూచనలు అందించటం గురించి అవగాహన కల్పించారు, గుంటూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎన్ మోహన్ రావు మాట్లాడుతూ ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా వరి వేసిన రైతులకు దిగుబడి తగ్గే అవకాశం



ఉందని, రైతులు అందరూ పంటల బీమా చేయించుకోవాలని, వరి పంటకు ఎకరానికి 800 చొప్పున బీమా కట్టుకున్నచో వారికి ఎకరానికి 40 వేల రూపాయల పంటల భీమా వర్తిస్తుందని తెలిపారు. అందరూ ఈ ఆగస్టు 15వ తారీకులోపు భీమా చేయించుకోవాలని కోరినారు, అలానే మినుము వేసిన రైతులు ఎకరానికి 200 రూపాయలు బీమా చెల్లించాలని కోరినారు. మండల వ్యవసాయ అధికారి రమణ కుమార్ మాట్లాడుతూ ప్రతి రైతు సేవా కేంద్రం నుండి టీంలు, ప్రతి రైతును కలసి ఎల్ నినో ప్రభావం గురించి, పంటల స్థితిగతుల గురించి వివరిస్తారాణి తెలిపారు, సీఈవో రామారావు సమక్షంలో పిఎండిఎస్ కిట్లు రైతులకు పంపిణీ చేశారు. అనంతరం ఎల్ నినో ప్రభావం- నివారణ కార్యాచరణ ప్రణాళికలో విత్తన గుళికల యొక్క ప్రాముఖ్యత గురించి వివరించి విత్తన గుళికలు ఎలా తయారు చేయాలో రైతులందరికీ చేసి చూపించినారు. తదుపరి ఇప్పటికే సాగులో ఉన్న వరి పొలాలను సందర్శించిఈ పంట నమోదు చేసినారు. కార్యక్రమంలో రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ అధికారులు, వాటర్ యూజర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బూసి బాబు, పిఎసిఎస్ ప్రెసిడెంట్ మైలా సుబ్బారావు ఎంపీటీసీ శ్రీనివాసరావు, ప్రోగ్రెసివ్ ఫార్మర్స్ శివరామకృష్ణ సూర్యనారాయణ, పెద్ది కృష్ణ రైతులు పాల్గొన్నారు.



**ప్రత్తిపాడులో రైతన్న మీకోసం**

ప్రత్తిపాడు శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులు తన క్యాంపు ఆఫీస్‌నందు నియోజకవర్గంలోని 5 మండలాల వ్యవసాయ అధికారుల సమక్షంలో ఎల్-నినో ప్రభావ నివారణ కార్యాచరణ ప్రణాళిక పేరిట సాంద్ర ప్రచార కార్యక్రమం ప్రారంభం, ప్రామాణిక నిర్వహణ విధానంకు సంబంధించిన కరపత్రాలు మరియు బుక్లేట్స్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, రైతులు తప్పనిసరిగా వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సలహాలు సూచనలు పాటించటంతో పాటు వ్యవసాయ సాగులో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పంటల బీమా పథకాన్ని వినియోగించుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న పి ఎం డి ఎస్ కిట్స్ కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు మోహన రావు, వ్యవసాయ అధికారులు సుబ్రహ్మణ్యం, సుగుణ బేగం, సునీత, సుధాకరరావులు రైతులకు పలు సలహాలు సూచనలు సూచించారు. అనంతరం పెదనంది పాడు మండలంలోని అభినేనిగుంట పాలెం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఈ కార్యకమాన్ని అమలుచేయడానికి ప్రతి రైతు సేవా కేంద్రం స్థాయిలో ఏర్పాటు చేయబడిన బహుళ శాఖల కార్యాచరణ కమిటీలో 1.ఆర్ఎస్కే అసిస్టెంట్ 2. పశు సంవర్ధక సహాయకుడు, 3. గ్రామ మత్స్య సహాయకుడు, 4. కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ 5. ప్రగతిశీల రైతులు, 6. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రతినిధులు, 7. నీటి వినియోగదారుల సంఘం ప్రతినిధులు 8. మార్కెట్ కమిటీ సభ్యులు,అందరూ సభ్యులుగా ఉంటారనీ, రైతులందరూ ఎల్ నినో వాతావరణ పరిస్థితులు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అనుబంధ శాఖ సిబ్బంది ప్రతి రైతు కుటుంబాన్ని సందర్శించి వారు వేసిన పంటలు వేయబోయే పంటలు వాటి యొక్క కండిషన్, వేసిన పంట పరిస్థితి ఏ విధంగా ఉంది అని క్షేత్రస్థాయిలో సందర్శించి భూభాగం వారీగా పంటల వివరాలను ఏపిఏఐఎంఎస్ యాప్‌లో నమోదు చేయడంతో పాటు ప్రతి రైతు యొక్క ప్రతి భూభాగం పై సమగ్ర నిర్ధారణ చేపట్టి, పంటల పరిస్థితి, తేమ లోపం, వాడిపోవటం, కీటకాలు మరియు వ్యాధుల ఉనికి, పి ఎం డి ఎస్ స్థితి, తోటలు, అలాగే బీడు మరియు పాడుబడిన భూములును అంచనా వేస్తారు అని తెలిపారు. మరియు పంట ఆరోగ్య స్థితిని నమోదు చేయించుకోవాలని రైతులకి తెలిపారు అదేవిధంగా కరువు నివారణ కోసం పీఎండీఎస్, రిలే సోయింగ్, విత్తన గుళికలు,అంతర్ పంటలు విధానాల అమలు చేయాలని తెలియజేశారు.

సుమారు 7 నుంచి 8 వారాల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని రైతులు ఎవరు ఆందోళన పడవద్దు అని, వ్యవసాయ శాఖ అందించే సలహాలు సూచనలు తప్పకుండా పాటించాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికా రి ఐ.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వర్షపాతం మండలంలో చాలా తక్కువగా నమోదు అయిందని ముఖ్యంగా వరి వేసే రైతులు ప్రత్యామ్నాయంగా అపరాలైనటువంటి మినుములు, కందులు వేసుకోవాలని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్రవజీవమృతం తయారీ విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.


# మెగా డీఎస్సీ-2025లో రిజర్వేషన్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలు అవాస్తవం

## -మెరిట్, రిజర్వేషన్ నిబంధనల ప్రకారమే ఎంపికలు - ప్రతి దశలో పారదర్శకత - పిడబ్ల్యూబిడి అభ్యర్థుల హారిజాంటల్ రిజర్వేషన్‌ను తప్పుగా అర్థం చేసుకోవద్దు : రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా

**అమరావతి, (రాజధాని వార్తలు):** మెగా డీఎస్సీ-2025 నియామకాలకు సంబంధించి సోషల్ మీడియాలో కొందరు అభ్యర్థులు తమకు రావాల్సిన ఉద్యోగాలు అభ్యర్థులకు కేటాయించడం వల్ల తమకు అన్యాయం జరిగిందంటూ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. మెగా డీఎస్సీ-2025లో మెరిట్, రోస్టర్ విధానం, వర్తించే రిజర్వేషన్ నిబంధనలు, ముఖ్యంగా హారిజాంటల్ రిజర్వేషన్‌ను నిర్దేశించిన G.O.Ms.No.77 ప్రకారం మాత్రమే ఎంపికలు జరిగాయని తెలిపారు. PwBD అభ్యర్థులకు కల్పించిన హారిజాంటల్ రిజర్వేషన్‌ను సోషల్ మీడియాలో తప్పుగా అర్థం చేసుకుని, ఎంపిక ప్రక్రియపై అపోహలు సృష్టించడం సరికాదని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ భారణితో కలసి ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ మెగా డీఎస్సీ-2025 ద్వారా అర్హత, మెరిట్, రిజర్వేషన్ నిబంధనలు మరియు రోస్టర్ విధానాన్ని సమన్వయం చేస్తూ చట్టబద్ధంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నియామకాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలను వాస్తవాల ఆధారంగా పరిశీలించాలని, మెగా డీఎస్సీ-2025 ఎంపిక ప్రక్రియపై అభ్యర్థులు, ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని ఆమె విజ్ఞప్తి చేశారు.

దేవగుప్తపు సంతోషి పార్వతి కేసులో వాస్తవాలు...

ఈమెకు బదులుగా PwBD అభ్యర్థిని ఎంపిక చేయడం వల్ల ఉద్యోగం కోల్పోయినట్లు సోషల్ మీడియాలో చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. EWS కేటగిరీకి చెందిన ఈమె PGT లో 92వ ర్యాంక్ సాధించారన్నారు. నోటిఫై చేసిన రెండు జుఔా పోస్టుల్లో ఒకటి 84వ ర్యాంక్ వరకు జనరల్ మెరిట్ ఆధారంగా భర్తీ కాగా, మరో పోస్టును నిబంధనల ప్రకారం హారిజాంటల్ రిజర్వేషన్ కింద అర్హత కలిగిన అశోక్‌కుమార్ మనివేల్తికి కేటాయించడం జరిగిందన్నారు. ఆయనకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి జారీ చేసిన ధ్రువపత్రం ప్రకారం 40 శాతం దృష్టి వైకల్యం ఉన్నట్లు నిర్ధారించబడిందన్నారు. దీంతో 92వ ర్యాంక్‌లో ఉన్న సంతోషి పార్వతి ఎంపిక పరిధిలోకి రాలేదన్నారు. ఇది వ్యక్తిగతంగా ఎవరినీ తప్పించడం కాదని, అమల్లో ఉన్న హారిజాంటల్ రిజర్వేషన్ నిబంధనల ప్రకారం జరిగిన చట్టబద్ధమైన ఎంపిక ప్రక్రియ అని ఆమె స్పష్టం చేశారు.



**భాస్కర్ రెడ్డి విషయంలోనూ ఇదే విధానం...**

తానుPwBDఅభ్యర్థి కారణంగా ఉద్యోగానికి దూరమయ్యానంటూ సోషల్ మీడియాలో చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కేటగిరీకి చెందిన అభ్యర్థి భాస్కర్ రెడ్డి కడప జిల్లాలో 68వ ర్యాంక్ సాధించారన్నారు. నోటిఫై చేసిన 8 పోస్టుల్లో 7 పోస్టులు 67వ ర్యాంక్ వరకు జనరల్ మెరిట్ ఆధారంగా భర్తీ కాగా, మిగిలిన ఒక పోస్టును అర్హత కలిగిన అభ్యర్థి గోనిగుంట్ల సుభాషిణికి హారిజాంటల్ రిజర్వేషన్ కింద నిబంధనల ప్రకారం కేటాయించడం జరిగిందన్నారు. అందువల్ల 68వ ర్యాంక్ సాధించిన భాస్కర్ రెడ్డి ఎంపిక పరిధిలోకి రాలేదన్నారు. ఇది ఎటువంటి నిబంధనల ఉల్లంఘన కాదని, మెరిట్, రోస్టర్, హారిజాంటల్ రిజర్వేషన్ నిబంధనల ప్రకారం జరిగిన చట్టబద్ధమైన ఎంపిక అని ఆమె స్పష్టం చేశారు.

హారిజాంటల్ రిజర్వేషన్‌పై స్పష్టత...

మెగా డీఎస్సీ-2025లో హారిజాంటల్ రిజర్వేషన్ విధానాన్ని G.O.Ms.No.77, తేదీ. 02.08.2023 ప్రకారం అమలు చేశామన్నారు. గతంలో ఉన్నట్లుగా మహిళలు, మాజీ సైనికులు, మెరిటోరియస్ స్పోర్ట్సు పెర్సన్కు ప్రత్యేకంగా స్థిర రోస్టర్ పాయింట్లు కేటాయించే విధానాన్ని కాకుండా, అర్హత కలిగిన హారిజాంటల్ రిజర్వేషన్ అభ్యర్థులను వారి సంబంధిత వర్టికల్/కమ్యూనిటీ రోస్టర్‌లోనే సర్దుబాటు చేసే విధానాన్ని అమలు చేయడం జరిగిందన్నారు. అందువల్ల అభ్యర్థి ఎంపిక అంటే సాధారణ మెరిట్‌ను పక్కన పెట్టి మరొక అభ్యర్థిని అన్యాయంగా తొలగించడం కాదని, చట్టబద్ధంగా కల్పించిన హారిజాంటల్ రిజర్వేషన్‌ను అమలు చేయడం అని కమిషనర్ స్పష్టం చేశారు.

**మెగా డీఎస్సీ-2025 ప్రక్రియ పూర్తిగా పారదర్శకం...**

రాష్ట్రవ్యాప్తంగా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించిన మెగా డీఎస్సీ-2025లో 3,36,300 మంది అభ్యర్థులు పాల్గొన్నారని, మొత్తం 5,77,675 దరఖాస్తులు అందాయని ఆమె తెలిపారు. పరీక్షలను 154 కేంద్రాల్లో, 24 రోజుల వ్యవధిలో 89 సెషన్లుగా కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం ప్రాథమిక కీ, అభ్యర్థుల రెస్పాన్స్ షీట్లు విడుదల చేసి అభ్యంతరాలకు అవకాశం కల్పించి, సబ్జెక్ట్ నిపుణుల పరిశీలన అనంతరం ఫైనల్ కీలు, శాస్త్రీయ నార్మలైజేషన్ ద్వారా తుది స్కోర్లు ప్రకటించడం జరిగిందని ఆమె తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం 15,941 మంది అభ్యర్థులను ఎంపికకు ఆమోదించడం జరిగిందని ఆమె తెలిపారు. నియామక ప్రక్రియలో 32,695కు పైగా ప్రశ్నలు/సందేహాలు, 1,135 గ్రీవెన్సులను సంబంధిత అధికార యంత్రాంగం నిబంధనల ప్రకారం పరిష్కరించిందని ఆమె తెలిపారు.

**సోషల్ మీడియా ప్రచారాన్ని వాస్తవాలతోనే చూడాలి...**

మెగా డీఎస్సీ-2025లో ప్రతి అభ్యర్థి ఎంపిక మెరిట్, ఖాళీలు, వర్తించే రిజర్వేషన్ నిబంధనలు, రోస్టర్ మరియు ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగానే జరిగిందని తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. కాబట్టి ఒక అభ్యర్థి ఎంపిక కాలేదనే కారణంతో అభ్యర్థి ఎంపికను తప్పుగా చూపిస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేయడం ద్వారా దివ్యాంగుల హక్కులను కల్పించిన చట్టబద్ధమైన రిజర్వేషన్ వ్యవస్థపై అపోహలు కలిగించడం సరికాదని ఆమె పేర్కొన్నారు.

**స్పోర్ట్స్ మెగా డీఎస్సీ-2025పై సోషల్ మీడియాలో జరుగుచున్న ప్రచారం అవాస్తవం...**

స్పోర్ట్స్ మెగా డీఎస్సీ-2025లో కొందరు అభ్యర్థుల క్రీడా ధ్రువపత్రాలపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ భరణి స్పష్టం చేశారు. అర్హత, క్రీడా మెరిట్, గుర్తింపు పొందిన క్రీడా సంఘాల ధ్రువీకరణ, ప్రభుత్వ నిబంధనల ఆధారంగానే ఎంపికలు జరిగాయని తెలిపారు. పింజారి ఇస్మాయిల్ బాషా, షేక్ అన్వర్ బాషా కేసుల్లో అభ్యర్థులు సమర్పించిన జూడో క్రీడా ధ్రువ పత్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ స్టేట్ జూడో అసోసియేషన్ కార్యదర్శి జారీ చేసిన సంబంధిత సంఘం ద్వారా పొందిన జన్యూన్‌నెస్ ధ్రువీకరణ, అభ్యర్థుల డిక్లరేషన్లు, గెజిటెడ్ అధికారులచే ధ్రువీకరించిన పత్రాలను పరిశీలించిన అనంతరమే వారి స్పోర్ట్స్ కోటా ఎంపిక జరిగింది. పింజారి ఇస్మాయిల్ బాషా తృతీయ స్థానం సాధించినట్లు సమర్పించిన ధ్రువపత్రాల ఆధారంగా వారి క్రీడా ప్రాధాన్యతలను నిర్ణయించడం జరిగిందన్నారు. అప్పట్లో సంబంధిత గుర్తింపు పొందిన క్రీడా సంఘం నుంచి జన్యూన్‌నెస్ ధ్రువీకరణ లభించిన నేపథ్యంలోనే ఎంపిక ప్రక్రియ ముందుకు సాగిందన్నారు. క్రీడా ధ్రువ పత్రాల నిజానిజాలను నిర్ధారించే బాధ్యత సంబంధిత గుర్తింపు పొందిన క్రీడా సంఘాలు/ఫెడరేషన్లదేనని, వాటి నుంచి అధికారిక ధ్రువీకరణ పొందిన అనంతరమే తదుపరి చర్యలు తీసుకోవడం జరిగిందని ఆమె స్పష్టం చేశారు. కేవలం సోషల్ మీడియా ఆరోపణల ఆధారంగా ఏ సర్టిఫికెట్‌నూ నకిలీదిగా నిర్ధారించలేమని, నిర్ధారించబడిన విశ్వసనీయ ఆధారాలు, అధికారిక ధ్రువీకరణలు, ప్రభుత్వ ఉత్తర్వులు, నియామక నిబంధనల ఆధారంగానే నిర్ణయాలు ఉంటాయని ఆమె తెలిపారు.

**ఆడియో వ్యవహారంపై వెంటనే పోలీసులకు ఫిర్యాదు...**

స్పోర్ట్స్ కోటా ఉద్యోగాలకు సంబంధించి అనుమానాస్పద ఆడియో సంభాషణ వెలుగులోకి వచ్చిన వెంటనే ాాూ్ర స్పందించిందని ఆమె తెలిపారు. తేదీ. 25.07.2025న విజయవాడ పోలీస్ కమిషనర్‌కు, అనంతరం తేదీ. 28.07.2025న జిల్లా పోలీస్ కమిషనర్‌కు అధికారికంగా ఫిర్యాదు చేసి దర్యాప్తు కోరినట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం సంబంధిత నిందితుడిని అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపరిచారని ఆమె వెల్లడించారు. అందువల్ల సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆధారరహిత ఆరోపణలుగా పరిగణించాలని, స్పోర్ట్స్ మెగా డీఎస్సీ-2025లో ప్రతి నిర్ణయం ధ్రువీకరించబడిన వాస్తవాలు, సంబంధిత క్రీడా సంఘాల అధికారిక నిర్ధారణలు, ప్రభుత్వ ఉత్తర్వులు, నియామక నిబంధనల మేరకే తీసుకున్నామని శ్రీమతి భరణి స్పష్టం చేశారు. నిజమైన క్రీడాకారులకు న్యాయం చేయడం, నకిలీ ధ్రువపత్రాలకు తావులేకుండా చూడడం, నియామక ప్రక్రియలో పారదర్శకతను కాపాడటం ప్రధాన లక్ష్యమని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్.విశ్వనాథన్ పాల్గొన్నారు.

# ఆది ఆంధ్ర భూమిని పరిరక్షిస్తాం : మాజీ ఎంపీ జి.వి.హర్షకుమార్

**కరప, (రాజధాని వార్తలు):** దళమ్మ చెరువుగట్టు ప్రాంతంలోని ఆది ఆంధ్ర భూమిని ఎట్టి పరిస్థితుల్లోనూ పరిరక్షిస్తామని, కోర్టు ఉత్తర్వుల పేరుతో భూమిలో ఎలాంటి చర్యలు చేపట్టినా అడ్డుకుంటామని మాజీ ఎంపీ జి.వి.హర్షకుమార్ స్పష్టం చేశారు. కరప మండలం వేళంగి దళమ్మ చెరువుగట్టు ప్రాంతంలో తలెత్తిన భూ వివాదాన్ని పరిశీలించేందుకు మాజీ పార్లమెంటు సభ్యులు జి.వి. హర్షకుమార్ గురువారం గ్రామాన్ని సందర్శించారు. వేళంగి గ్రామ సర్పంచ్ సవిలే నీలిమ, గ్రామస్థులతో కలిసి వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. దళమ్మ చెరువుగట్టు ప్రాంతంలోని సర్వే నంబరు 313లో ఉన్న భూమి మాలల ఆదిఆంధ్ర భూమి అని, అదే ప్రాంతంలో 2009లో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని తానే ఆవిష్కరించినట్లు తెలిపారు. సర్వే నంబరు 313లో మెర్ల జయశంకర్ కిషన్‌కు ఎలాంటి భూమి లేదని రెవెన్యూ, పంచాయతీ అధికారులు ధృవీకరించినప్పటికీ, ఆయనకు కోర్టు ఇంజక్షన్ ఉత్తర్వులు రావడం ఆశ్చర్యకరమని పేర్కొన్నారు. ఇందుకు తప్పుడు పత్రాలు సమర్పించి ఉండే అవకాశంపై అధికారులు సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కొందరు ఆక్రమించారని ఆరోపిస్తూ అక్కడ నివాసముంటున్న మాల కులస్తులపై కాకుండా కరప తహసీల్దార్, జిల్లా కలెక్టర్‌లపై కేసు నమోదు చేయడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. కోర్టు తీర్పును గౌరవిస్తామని, అయితే కోర్టు ఉత్తర్వులను సాకుగా చూపి ఆదిఆంధ్ర భూమిలో ఎలాంటి చర్యలు చేపట్టినా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. అవసరమైతే కోర్టు తీర్పుపై అప్పీల్‌కు వెళ్తామని వెల్లడించారు.

ఇటీవల భూముల విలువలు పెరగడంతో ఎస్సీలకు చెందిన భూములపై కొందరు కన్నేశారని ఆరోపించిన హర్షకు మార్, ఆదిఆంధ్ర భూముల పరిరక్షణ కోసం అవసరమైన న్యాయ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ నాయకులు సవిలే రాజేష్, మారెళ్ల వెంకటరమణ, మాత అప్పారావు, వజ్రపు కామేశ్వరరావు, శేఖర్, సాదే లోహిదాస్ తదితరులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## కాక్రోచ్ కదన కుతూహలమేమిటి?

నమ్మశక్యం కాని విషయాలు అప్పుడప్పుడు వాస్తవాలుగా పరిణమించడం భారతదేశ విలక్షణత. తమ చుట్టూ ఉన్న సమాజాన్ని మార్చివేయాలని అనునిత్యం అనేకానేక మంది ఆకాంక్షిస్తుంటారు. స్వప్న సాధకులు ఎంతమంది? అరుదు, చాలా అరుదు. కనుకనే ఉద్యమ భారతంలో 30 ఏళ్ల యువకుడు అభిజిత్ దీప్కే సాఫల్యాన్ని ఒక అసాధారణ విజయంగా మనం భావించి తీరాలి. 'కాక్రోచ్‌లు సంఘటితమవ్వాలి' అని మే 16న విజ్ఞప్తి చేసిన ఒక ట్వీట్ దేశవ్యాప్తంగా యువజనుల నిరసనోద్యమంగా ప్రజ్వరిల్లి అంతిమంగా ఒక కేంద్రమంత్రి రాజీనామాకు దారి తీస్తుందని ఎవరు ఊహించారు? ఈ దేశంలో, నెల రోజుల క్రితం దీప్కే గురించి విన్నవారు ఎంతమంది? ఆయన ఏర్పాటు చేసిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)ని పట్టించుకున్న వారెంతమంది? మరి నేడు శంభాజీనగర్‌లోని దీప్కే నివాసం ఎదుట వందలాది టీవీ చానెళ్ల రిపోర్టర్లు, యూట్యూబర్లు, సీనియర్ రాజకీయ నాయకులు బారులు తీరుతున్నారు. ఆన్‌లైన్ ఫ్యాడ్‌గా అనేకమంది కొట్టిపారేసిన ఉదంతమే అనూహ్యంగా ఈ ఏడాది అతిపెద్ద రాజకీయ సంఘటనగా నిలిచింది. ఉద్యమ తక్షణ లక్ష్యం నెరవేరింది. అసలు సవాల్ ఇప్పుడే మొదలయింది. కాక్రోచ్ జనతా పార్టీ ఇప్పుడు ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే స్వతంత్ర బృందం (ప్రెజర్ గ్రూప్)గా ఉండిపోతుందా? లేక, ఎన్నికల రాజకీయాలలోకి దూకుతుందా? ఈ విషయమై దీప్కేను ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ప్రశ్నించాను (సామా జిక మాధ్యమాలలో అనేకమంది సైతం ఇదే ప్రశ్న అడుగుతున్నారు).. నా ప్రశ్నకు దీప్కే వెన్వెంటనే ఇలా సమాధానమిచ్చారు: 'సీజేపీని ఒక రాజకీయ పార్టీగా మార్చే విషయం గురించి మేము ఆలోచించనే లేదు. ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకుల జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసే నిరసనోద్యమంగా మాత్రమే ఉండిపోవాలని మేము భావిస్తున్నాము'. ఇటువంటి మాటలనే ఇండియా ఇంతకు ముందూ విన్నది. 2011లో అవినీతి నిర్మూలనోద్యమం ఉధృతంగా కొనసాగుతున్నప్పుడు రాజకీయాలలోకి ప్రవేశించే ఉద్దేశం తనకు ఎంతమాత్రం లేదని అరవింద్ కేజ్రీవాల్ పదే పదే ఉద్ఘాటించారు. రెండు సంవత్సరాల అనంతరం ఢిల్లీ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించింది ఆయనే కాదూ? విజయవంతమైన ప్రతి నిరసనోద్యమమూ అంతిమంగా ఒకే విధమైన సందిగ్ధావస్థ నెదుర్కోవటం కద్దు: నైతిక పలుకుబడిని రాజకీయ అధికారంగా మార్చుకోవడం ఎలా? ఈ సంకట పరిస్థితిని చాలా మంది కంటే దీప్కే మెరుగ్గా అర్థం చేసుకున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీతో పనిచేసిన అనుభవం దీప్కేకు ఉన్నది. ప్రజాగ్రహాన్ని ఎన్నికల విజయంగా ఎలా మార్చుకోవచ్చో ఆప్ నిరూపించింది. ఉద్యమ సాఫల్యంతో సమకూరిన నైతిక అధికారాన్ని, పోటీ రాజకీయాలలోకి ప్రవేశించిన తరువాత నిలబెట్టుకోవడం ఎంత కష్టమో అన్నదానికి కూడా ఆ పార్టీ ఒక దృష్టాంతం అయింది. ఎన్నికల రాజకీయాలలోకి దిగిన తరువాత పొత్తులు, రాజీలు, సంస్థాగత ఒత్తిళ్లు అనివార్యం కదా. వ్యవస్థపై ప్రజాగ్రహం మాత్రమే కాకుండా మరెన్నో అంశాలు కలిసివస్తేనే మౌలిక రాజకీయ మార్పును సాధించడం సాధ్యమవుతుంది. చరిత్ర సూచిస్తున్న సత్యమిది. సరైన సమయంలో సరైన నాయకుడు రంగంలో ఉండడం చాలా ముఖ్యం. అంతకంటే ముఖ్యంగా అతడి ప్రాభవ ప్రాబల్యాలకు ఒక స్పష్టమైన సామాజిక మద్దతు ఉండి తీరాలి. కేజ్రీవాల్ కేవలం అవినీతి నిర్మూలనోద్యమం ఆధారంగా ఢిల్లీ అధికారాన్ని కైవసం చేసుకోలేదు. అంతకంతకూ విస్తరిస్తోన్న పట్టణ మధ్యతరగతి వర్గానికి ఆయన రాజకీయ గొంతుక అయ్యారు. ఆ విస్తృత సామాజికవర్గం ఆలంబనతోనే కేజ్రీవాల్ తన అధికారోన్నతికి సోపానాలు నిర్మించుకున్నారు. తమిళనాడులో ఈ ఏడాది అసాధారణ రాజకీయ విజయం సాధించిన జోసెఫ్ విజయ్ కథ కూడా విశిష్టమైనది. సినీ నటుడు అయిన విజయ్, తమిళ సమాజానికి విలక్షణమైన సినిమా సంస్కృతి, రాజకీయాలను కలగలిపి అద్భుత విజయాన్ని అందుకున్నారు. ద్రావిడ పార్టీల దశాబ్దాల ప్రాబల్యాన్ని ఎదుర్కొనేందుకు ఆయన ప్రధానంగా యువతరంపై ఆధారపడ్డారు. సంప్రదాయ కుల, వర్గ అంతరాలకు అతీతంగా యువ ఓటర్లు విజయ్ పట్ల ఆకర్షితులయ్యారు. ఆయనకు అద్వితీయ విజయాన్ని అందించారు. ప్రజల ధర్మాగ్రహం ఒక ఉద్యమాన్ని ప్రజ్వలింప జేయవచ్చు. అయితే అది అరుదుగా మాత్రమే ఎన్నికల సవాళ్లను సమర్థంగా ఎదుర్కొగలుగుతుంది. కాక్రోచ్ జనతా పార్టీ కీలక మద్దతుదారులు ఎవరు? ప్రశ్న పత్రాల లీక్‌లపై ఆగ్రహిస్తోన్న జెన్ జీ విద్యార్థులా? ఉద్యోగాన్వేషణలో వేసారుతున్న నిరుద్యోగ పట్టభద్రులా? భారత్ అనుపమానంగా సాధిస్తున్న అభివృద్ధిలో తమకు సముచిత రీతిలో వాటా లభించడం లేదని ఆగ్రహిస్తున్న దిగువ మధ్యతరగతి ప్రజలా? కొత్త రాజకీయ వ్యూహాలకు ప్రయత్నిస్తున్న అంబేడ్కర్ వాదులా? అధికారంలో ఏ పార్టీ ఉన్నా ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించడంలేదని ఆగ్రహిస్తున్న ముప్పై ఏళ్లలోపు వయసు ఉన్న నవ యువతరమా? ఈ ప్రశ్నలకు సమాధానం లభించనంతవరకు ఏ నిరసనోద్యమాన్ని అయినా సరే ఒక ఎన్నికల శక్తిగా మార్చడమనేది చాలా కష్టసాధ్యమవుతుంది. సీజేపీ విషయంలో మరో కారణం కూడా ఉన్నది. 2013లో ఢిల్లీలో, 2026లో తమిళనాడులో ఉన్న రాజకీయ పరిస్థితులకు నేటి జాతీయ రాజకీయ దృశ్యం పూర్తిగా భిన్నమైనది. ఇప్పుడు భారతీయ జనతా పార్టీ భారతదేశ ప్రధాన ఎన్నికల శక్తిగా వర్ధిల్లుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీర్తి చంద్రికలు కించిత్ మసకబారి ఉండవచ్చు గానీ ఆయన ఇప్పటికీ శిఖర సమానుడు. ఒక అజేయశక్తిగా వెలుగొందుతున్నారు. కేంద్ర కేబినెట్ మంత్రి రాజీనామాను అనివార్యం చేయడం విశిష్ట రాజకీయ విజయమే, సందేహం లేదు.

## ప్రభుత్వ సమాచార వ్యాప్తిని బలోపేతం చేసేందుకు ఐఎంపిసిసి సమావేశాన్ని నిర్వహించిన పిఐబి విజయవాడ

**- ప్రజా సమాచార వ్యాప్తిని వేగవంతం చేసి, అవాస్తవ సమాచారాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వ శాఖల మధ్య బలమైన సమన్వయానికి పిలుపు**






**విజయవాడ, (రాజధాని వార్తలు):** కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం పరిధిలోని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) విజయవాడ, వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల ప్రచార విభాగాల మధ్య పరస్పర సమన్వయాన్ని బలోపేతం చేసేందుకు, ప్రతిష్టాత్మక కార్యక్రమాల ప్రచార వ్యూహాలను మెరుగుపరిచేందుకు, అవాస్తవ సమాచారాన్ని అడ్డుకునేందుకు మరియు ప్రభుత్వ సమాచార ప్రసారాన్ని బలోపేతం చేసేందుకు ఇంటర్ మీడియా పబ్లిసిటీ కోఆర్డినేషన్ కమిటీ (ఐఎంపిసిసి) సమావేశాన్ని ఈ రోజు నిర్వహించింది. జి.సురేష్ కుమార్, డైరెక్టర్, పిఐబి విజయవాడ ప్రారంభోపన్యాసంలో... కేంద్ర సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన మీడియా విభాగాలైన విజయవాడ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, దూరదర్శన్ మరియు ఆల్ ఇండియా రేడియోలు చేపట్టిన పలు ప్రధాన కార్యక్రమాలను ప్రముఖంగా ప్రస్తావించారు. సమర్థవంతమైన ప్రజా సమాచార ప్రసారం కోసం అన్ని విభాగాల మధ్య సమన్వయ ప్రయత్నాల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. అలాగే ప్రభుత్వ కార్యక్రమాలు, చొరవలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో ఈ మీడియా విభాగాల నుంచి పూర్తి మద్దతు ఉంటుందని కూడా ఆయన హామీ ఇచ్చారు. వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాలు మరియు సంస్థల ప్రతినిధులు వారి కీలక కార్యకలాపాలు, కార్యక్రమాలు మరియు విజయాలను పంచుకునేందకు ఈ ఐఎంపిసిసి సమావేశం ఒక వేదికైంది. ఈ సమావేశంలో తపాలా, రైల్వేలు, ఎయిమ్స్, ఎన్‌హెచ్ఏఐ, ఎఫ్‌సిఐ, కెవిఐసి, ఎన్ఎస్ఓ, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, దూరదర్శన్ మరియు ఆకాశవాణి వంటి పలు కేంద్ర ప్రభుత్వ విభాగాలు మరియు సంస్థల నుంచి 15 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు సమాచార వ్యూహాలను మెరుగుపరిచేందుకు వారి అభిప్రాయాలను మరియు సూచనలను పంచుకున్నారు. ఇటీవల వారి విభాగాల్లో చేపట్టిన ప్రచార కార్యక్రమాలపై తాజా సమాచారాన్ని కూడా అందించారు.

## అభివృద్ధి, సంక్షేమంతో పాలన : ఎమ్మెల్యే



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం మూడోయేట పరిపాలన బ్రహ్మాండంగా జరుగుతుందని, ఈ పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. గురువారం సామర్లకోట పట్టణ పరిధిలోని 26వ వార్డులో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బడుగు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఇంటింటా తెలుగుదేశం, కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ప్రజలకు అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల వల్లే కూటమి ప్రభుత్వానికి ప్రజల సంపూర్ణ మద్దతు లభిస్తుందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని ప్రజలు గుర్తించినప్పటికీ, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అభివృద్ధి కనిపించకపోవడం సిగ్గుచేటన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కూడా ప్రజల సహకారంతో కూటమి ఘనవిజయం సాధిస్తుందని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి అభివృద్ధిపై ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలి. ఈ కార్యక్రమంలో నాయకులు అడబాల కుమారస్వామి, కంటే జగదీష్ మోహన్, బలుసు వాసు, సరోజ వాసు, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, నిమ్మకాయల కిరణ్, అత్తిలి కృష్ణ, బొందల రామలక్ష్మి, గోలి సత్తిరాజు, పడాల వీరబాబు, దాట్ల శ్రీనివాస్, పైణ్ణి శ్రీనివాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ వై ఎస్ ఆర్ సి పి రిలే నిరాహార దీక్ష

**- అమలాపురం హై స్కూల్ సెంటర్లో రిలే నిరాహార దీక్ష ప్రారంభించిన వైసీపీ శ్రేణులు**



**అమలాపురం, (రాజధాని వార్తలు):** ఏపీ డీఎస్సీ 2025 నియామకాలలో జరిగిన క్రమలపై సిబిఐ విచారణ చేపట్టాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల హామీ ప్రకారం నిరుద్యోగ భృతిని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అమలాపురంలో రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ మంత్రి, ఏపీ సి సభ్యులు, అమలాపురం పార్లమెంట్ ఇంచార్జ్ పినిపే విశ్వరూప్, శ్రీకాంత్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం హైస్కూల్ సెంటర్ వద్ద గురువారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని ఎలాంటి జాప్యం లేకుండా అమలు చేయాలని, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థులు, నిరుద్యోగ యువత ఆశలను కూటమి నేతలు వాడుకొని నమ్మించి మోసం చేశారని శ్రీకాంత్ మండి పడ్డారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ ప్రశ్నపత్రం లింక్ ఘటనలో కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ అదే తరహాలో రాష్ట్రంలో చోటు చేసుకున్న డీఎస్సీ నియామకాల అక్రమాలపై సిబిఐతో విచారణ జరిపించి ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అమలాపురం వైసీపీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పినిపే శ్రీకాంత్, వైయస్ ఆర్సీపీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీలు కుడిపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎంపీ చింతా అనురాధ, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన శ్రీనివాసరావు, వంటెద్దు వెంకన్నాయుడు, సంసాని నాని, కుడుపూడి భరత్ భూషణ్, ఉండ్రు వెంకటేష్, కుడిపూడి త్రినాథ్, సరేళ్ళ రామకృష్ణ, మట్టపర్తి నాగేంద్ర, దోమ్మేటి రాము, వాసర్ల సుబ్బారావు, యండమూరి శ్రీను, కముజు రమణ, ఖాదర్, సుదా గణపతి, దొంగ బాలాజీ, కుడిపూడి త్రినాథ్, సత్యం కాపు, అంబికా శ్రీను రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు.

**నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమణ**

ఉదయం నుండి రిలే నిరాహార దీక్ష చేపట్టిన వైయస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలకు గురువారం సాయంత్రం మాజీ మంత్రి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు.


## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు జెడ్పి విద్యార్థి ఎంపిక



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్లస్ సామర్లకోట పాఠశాలకు చెందిన కుమారి అల్లంపల్లి తేజస్విని సాయి 10వ తరగతి విద్యార్థిని జులై 26వ తేదీన కాకినాడ డిఎస్సి గ్రౌండ్‌లో జరిగిన సౌత్ జోన్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ పోటీలలో అండర్ 16 విభాగంలో పెంటాథ్లాన్‌లో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయింది. దానితో విద్యార్థిని అభినందించే కార్యక్రమం గురువారం పాఠశాలలో నిర్వహించారు. అల్లంపల్లి తేజస్విని సాయి తిరుపతి వెంకటేశ్వర యూనివర్సిటీలో ఆగస్టు 11 నుంచి 13 వరకు జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్ మీట్లో పాల్గొనడం జరుగుతుందని హెచ్ఎం విజయలక్ష్మి చెప్పారు. ఈ సందర్భంగా తేజస్విని ప్రతిభను పాఠశాల హెచ్ఎం రాయుడు విజయలక్ష్మి, పిడిలు మేరి హవీలా, ఆర్ వరలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల కమిటీ చైర్మన్ భవాని, వైస్ చైర్మన్ పచ్చాకుల లోవరాజు తదితరులు కొనియాడుతూ అభినందించారు.

## మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఆదిత్య ప్రో.ఛాన్సలర్ డా.సతీష్ రెడ్డి దంపతులు

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీ మరిడమ్మ అమ్మవారి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా గురువారం ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి శృతి రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ పరిపాలనాధికారి కె విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వేదాశీర్వచనం, శేష వస్త్రం, ప్రసాదం అమ్మవారి చిత్రపటం, అందించి ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి దంపతులు ఆలయ అన్నదాన కార్యక్రమానికి లక్ష రూపాయల విరాళం అందజేశారు.



## మరిడమ్మ అమ్మవారికి ట్రాన్స్‌జెండర్లు బోనాలు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి చెందిన పెద్దాపురం గ్రామ దేవత మరిడమ్మ తల్లి అమ్మవారికి ఆషాడ మాసం పురస్కరించుకుని ఘనాచార్యులు, ట్రాన్స్‌జెండర్స్ గురువారం బోనాలను సమర్పించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఘనాచార్యులు పెద్దాపురం చేరుకుని ట్రాన్స్ జెండర్స్‌తో కలిసి పెద్దాపురం పురవీధుల మీదుగా బోనాలతో భాజా భజంత్రీలతో, ఊరేగింపుగా మరిడమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకుని భక్తి శ్రద్ధలతో బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఘనాచార్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ అమ్మవారి ఉత్సవాలు జరిగిన తాము ఆ గ్రామానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో గ్రామంలో కుటుంబాలు, గ్రామ రక్షణ కోసం అమ్మవారికి మొక్కుకుని బోనాలను సమర్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోనే వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున గణాచార్యులు, ట్రాన్స్ జెండర్స్ పాల్గొన్నారు.

## జక్కంపూడి జీవితం స్ఫూర్తి కావాలి




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** దివంగత నాయకులు మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్ రావు పోరాటాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తి కావాలని పెద్దాపురం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ దవులూరి దొరబాబు అన్నారు. సామర్లకోట పట్టణంలో గురువారం గడియారం సెంటర్ వద్ద జక్కంపూడి రామ్మోహన్ రావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జక్కంపూడి రామ్మోహన్‌రావు చిత్రపటానికి దొరబాబు, వైసిపి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు నెక్కంటి సాయి ప్రసాద్, ఊబా జాన్ మోజెస్, పాగా సురేష్ కుమార్, ఆవాల లక్ష్మీ నారాయణ, ఇరుసు మళ్ళ సాయి, సేపేని రూప సురేష్, పాలికి కుసుమ చంటిబాబు, తలారి దొరబాబు, బొబ్బరాడ సత్తిబాబు, తదితర నాయకులు పాల్గొన్నారు.

# ట్రెడిషనల్ లుక్‌లో క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్.. రితికా నాయక్ లేటెస్ట్ పిక్స్!





టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న ఢిల్లీ భామ రితికా నాయక్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తన నటనతోనే కాకుండా, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కుర్రకారు హృదయాలను దోచుకుంటోంది. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ, తాజాగా షేర్ చేసిన ట్రెడిషనల్ ఫొటోషూట్ పిక్స్ నెట్టింట విపరీతంగా వైరల్ అవుతున్నాయి. సాంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోతూ అభిమానులను అలరిస్తున్న రితికా నాయక్ లేటెస్ట్ విశేషాలు మీకోసం.

**టాలీవుడ్‌లో లక్కీ హీరోయిన్‌గా ముద్ర:**

ఢిల్లీ నుంచి వచ్చిన రితికా నాయక్ చాలా తక్కువ సమయంలోనే తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ఇప్పటివరకు చేసిన సినిమాలన్నీ మంచి విజయాన్ని సాధించడంతో ఆమెను టాలీవుడ్‌లో లక్కీ హీరోయిన్‌గా అభివర్ణిస్తున్నారు. ఇక కెరీర్ ప్రారంభంలోనే వరుస విజయాలు అందుకోవడం వల్ల ఆమెకు అవకాశాలు వెల్లువలా వస్తున్నాయి. తన క్యూట్‌నెస్‌తో ప్రతి సినిమాలోనూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు.

**సినిమా ప్రయాణం.. వరుస హిట్లు:**

యంగ్ హీరో విశ్వక్ సేన్ నటించిన 'అశోకవనంలో అర్జున కళ్యాణం' సినిమాతో రితికా తెలుగు తెరపై మెరిశారు. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకోవడమే కాకుండా, తన నటనతో మంచి మార్కులు కొట్టేశారు. ఆ తర్వాత నేచురల్ స్టార్ నాని నటించిన 'హాయ్ నాన్న' సినిమాలో ఆయన కూతురిగా చిన్న పాత్ర పోషించి అందరి దృష్టిని ఆకర్షించారు. ఇక అనంతరం తేజా సజ్జ సరసన వచ్చిన 'మిరాయ్' చిత్రంతో బిగ్గెస్ట్ హిట్ కొట్టారు. ఇటీవల వచ్చిన 'కొరియన్ కనకరాజు' కూడా విజయం సాధించడంతో ఆమె హ్యాట్రిక్ సక్సెస్‌లను తన ఖాతాలో వేసుకున్నారు. సాంప్రదాయ దుస్తుల్లో అందంగా మెరిసిన రితికా నాయక్.. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. ప్రసిద్ధ డిజైనర్ భార్గవి కునమ్ డిజైన్ చేసిన పాస్టెల్ పింక్ లేహంగా సెట్‌లో ఆమె దేవకన్యలా మెరిసిపోతున్నారు. ఇక గోల్డ్ మరియు పింక్ రంగు కలయికలో జరీ, సీక్విన్ మరియు బీడ్ వర్క్‌తో చేసిన స్లీవ్‌లెస్ బ్లౌజ్ ఆమెకు ఎంతో రాయల్ లుక్‌ను తెచ్చిపెట్టింది.

**అట్రాక్టివ్ లెహంగా, దుపట్టా :**

ఆమె ధరించిన పింక్ అండ్ మావ్ షేడ్‌తో కూడిన మల్టీ-టైర్డ్ లేహంగా స్కర్ట్ చాలా లేయర్లుగా ఉంటూ గ్రాండ్ లుక్‌ను ఇచ్చింది. దీనికి తోడుగా బోర్డర్‌పై జిగేల్ మనే ఎంబ్రాయిడరీ వర్క్ ఉన్న ట్రాన్స్‌పారెంట్ పాస్టెల్ పింక్ జార్జెట్ దుపట్టాను వేసుకోవడంతో ఆమె అందం రెట్టింపైంది. ఇక సాంప్రదాయ లుక్‌కు తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ తోడవ్వడంతో ఆ ఫొటోలు క్షణాల్లో వైరల్ అయ్యాయి. తన నటనతోనే కాకుండా గ్లామర్ అండ్ ఫ్యాషన్ సెన్స్‌తో కూడా రితికా నాయక్ కుర్రకారును ఆకట్టుకుంటున్నారు. ఇక సరైన కథలను ఎంచుకుంటూ టాలీవుడ్‌లో లక్కీ చార్మ్‌గా మారిన ఈ బ్యూటీ, భవిష్యత్తులో మరిన్ని పెద్ద ప్రాజెక్ట్‌లతో మరింత ఎత్తుకు ఎదగాలని కోరుకుందాం.


# ఆస్కార్ విన్నర్ చిత్రంలో ప్రియాంక చోప్రా!





గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా అంతర్జాతీయ సినీ ప్రయాణాన్ని మరింత ఉత్సాహంగా కొనసాగిస్తున్నారు. ఇప్పటికే అనేక హాలీవుడ్ చిత్రాలతో తనదైన ముద్ర వేసిన పీసీ తాజాగా మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. నిమ్రోడ్ అంతల్ దర్శకత్వంలో తెరకెక్కనున్న సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ 'బ్లూ ప్లైట్' చిత్రంలో ప్రధాన పాత్రకు ఎంపికయ్యారు. ఈ చిత్రంలో ఆస్కార్ అవార్డు గ్రహీత.. ప్రముఖ నటుడు రస్సెల్ క్రోతో కలిసి పీసీ స్క్రీన్ పంచుకోవడం విశేషం. ఈ చిత్ర కథాంశం చాలా ఆసక్తికరంగా ఉంది. కాంగో అడవుల నేపథ్యంలో సాగే కథ ఒక యుఎన్ ట్రాన్స్‌లేటర్ చుట్టూ తిరుగుతుంది. విమానం కూలిపోయిన ప్రదేశాన్ని కనుగొనే బ్లాక్-ఆప్స్ మిషన్‌లో పీసీ భాగస్వామి అవుతుంది. ఆ ప్రయాణంలో ఎదురయ్యే ఊహించని మలుపులు, మిలీషియా దళాల మధ్య సాగే పోరాటాలు సినిమాకు ప్రధానాకర్షణగా నిలవనున్నాయి. ఒక సాహసోపేతమైన ప్రయాణం ఎలా ప్రమాదకరంగా మారుతుందనేది సినిమా కథాంశం. ప్రియాంక చోప్రా సోషల్ మీడియా ఖాతా ద్వారా ఈ వార్తను పంచుకోగా అభిమానులు .. తోటి సినీ ప్రముఖుల నుండి భారీ స్పందన లభించింది. ముఖ్యంగా పీసీ భర్త గాయకుడు నిక్ జోనాస్ ప్రియాంక కొత్త ప్రాజెక్ట్‌ను చూసి ఉత్సాహంగా స్పందించారు. నెటిజన్లు సైతం ప్రియాంక మరో అద్భుతమైన ప్రాజెక్ట్‌తో సిద్ధమవుతోంది అంటూ సోషల్ మీడియా వేదికగా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రం కోసం మైఖేల్ జెఫెర్సన్, డేవిడ్ ఫ్రిగేరియో, డెబోరా గ్లోవర్ , ఆరియాన్ ఫ్రేజర్ వంటి వారు నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. 'బ్లూ ప్లైట్' ఒక హృదయ స్పందనను పెంచే వినోదాన్ని అందిస్తుందని సంక్లిష్టమైన కథనంతో ప్రేక్షకుల ముందుకు వస్తుందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది. గ్లోబల్ మార్కెట్‌లో ఈ సినిమా ప్రేక్షకులను ఖచ్చితంగా అలరిస్తుందని నిర్మాత ఆరియాన్ ఫ్రేజర్ ధీమా వ్యక్తం చేసారు. హాలీవుడ్ ప్రాజెక్టులతో పాటు భారతీయ సినీ ప్రేక్షకుల కోసం ప్రియాంక చోప్రా సిద్ధమవుతున్న భారీ ప్రాజెక్ట్ 'వారణాసి'. రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ద్వారా ఎనిమిదేళ్ల విరామం తర్వాత పీసీ మళ్ళీ ఇండియన్ స్క్రీన్‌పై కనిపించనున్నారు. ఇలా ఒకవైపు గ్లోబల్ స్థాయి యాక్షన్ థ్రిల్లర్.. మరోవైపు రాజమౌళి వంటి దిగ్గజ దర్శకుడితో భారీ పీరియాడిక్ డ్రామా. ఇలా రెండు విభిన్న ప్రపంచాలను ప్రియాంక చోప్రా సమతుల్యం చేసుకుంటున్న తీరు ప్రశంసనీయం. అమ్మడు ఎంచుకుంటున్న కథలు గ్లోబల్ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా భారతీయ నటిగా పీసీ కీర్తిని మరింత పెంచుతున్నాయి. 'బ్లూ ప్లైట్', 'వారణాసి' చిత్రాలు అమ్మడి కెరీర్‌లో మైలురాళ్లుగా నిలవడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# బాలీవుడ్ నంబర్ 1 క్వీన్‌గా అలియా భట్!



సినీ ఇండస్ట్రీలో తన స్టైల్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అలియా భట్, ఇప్పుడు ఇండియాలో టాప్ మహిళా సెలబ్రిటీల్లో ఒకరిగా నిలిచింది. ప్రముఖ సంస్థ క్రోల్ విడుదల చేసిన బ్రాండ్ వేల్యూ నివేదికలో దీపికా పదుకొణె, రష్మిక మందన్న వంటి అగ్ర కథానాయికలను వెనక్కి నెట్టి అలియా అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. వరుస హిట్లు, అంతర్జాతీయ బ్రాండ్ల రాయబారంతో ఆమె ఈ అరుదైన ఘనతను సాధించి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఆ విశేషాలు చూద్దాం..

**సెలబ్రిటీ బ్రాండ్ వేల్యూలో టాప్:**

ప్రముఖ ఆర్థిక అధ్యయన సంస్థ 'క్రోల్' ఇటీవల విడుదల చేసిన సెలబ్రిటీ బ్రాండ్ వాల్యుయేషన్ రిపోర్ట్‌లో అలియా భట్ మొదటి స్థానంలో నిలిచారు. ఇక భారతదేశంలో ఉన్న మిగతా హీరోయిన్లందరి కంటే ఆమె బ్రాండ్ విలువ అత్యధికంగా నమోదు కావడం విశేషం. కేవలం నటనతోనే కాకుండా, బిజినెస్ రంగాన్ని కూడా శాసిస్తూ ఆమె ఈ స్థాయికి చేరుకున్నారు.

**పోటీలో ఇతర నాయికలు:**

ఈ జాబితాలో అలియా తర్వాతి స్థానంలో దీపికా పదుకొణె రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. అలాగే నేషనల్ క్రష్ రష్మిక మందన్న మూడో స్థానాన్ని కైవసం చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇక సీనియర్ నటి కరీనా కపూర్ ఖాన్, గ్లామరస్ బ్యూటీ కియారా అద్వానీ కూడా టాప్ రేసులో నిలిచి తమ క్రేజ్‌ను చాటుకున్నారు.

**అంతర్జాతీయ గుర్తింపు & వ్యాపారాలు:**

అలియా భట్ విజయంలో ఆమె సినిమాలతో పాటు ఇతర వ్యాపారాలు కూడా కీలక పాత్ర పోషించాయి. అంతర్జాతీయ లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్లకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించడంతో పాటు, 'ఎడ్-ఎ-మమ్మ' అనే పిల్లల దుస్తుల బ్రాండ్‌ను విజయవంతంగా నడుపుతున్నారు. ఇక దీనివల్ల ప్రకటనల ప్రపంచంలో ఆమె అత్యంత డిమాండ్ ఉన్న తారగా మారారు. అదే జోరు.. అద్భుతమైన లైనప్: ఇటీవల వచ్చిన 'ఆల్ఫా' సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయినా, అలియా క్రేజ్ మాత్రం తగ్గలేదు. ఇక సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో రాబోతున్న 'లవ్ అండ్ వార్' సినిమాలో రణ్‌బీర్ కపూర్, విక్కీ కౌశల్‌లతో కలిసి ఆమె నటిస్తున్నారు. భవిష్యత్తులో రాబోయే భారీ సినిమాలతో తన నంబర్ 1 స్థానాన్ని మరింత పటిష్టం చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. కేవలం నటనకే పరిమితం కాకుండా, గ్లోబల్ బ్రాండ్‌గా రూపాంతరం చెందిన అలియా భట్ ప్రయాణం ఎందరికో స్ఫూర్తిదాయకం. ఇక సరైన కథల ఎంపిక, వ్యాపార దార్శనికతతో ఆమె బాలీవుడ్ నిజమైన నంబర్ 1 క్వీన్‌గా నిలిచారు.

# ఎన్టీఆర్ గారిని ట్రోల్ చేయలేదు.. కొరియన్ కనకరాజు టీమ్ క్లారిటీ



మెగా హీరో వరుణ్ తేజ్ నటించిన లేటెస్ట్ సినిమా కొరియన్ కనకరాజు ఈరోజు థియేటర్లలోకి వచ్చిన విషయం తెలిసిందే. డైరెక్టర్ మేర్లపాక గాంధీ తెరకెక్కించిన ఈ సినిమాకి నిన్న రాత్రి పడిన ప్రీమియర్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో ప్లాన్ చేసిన వందకు పైగా ప్రీమియర్ షోలు అన్నీ హౌస్ ఫుల్ అవ్వడంతో మంచి స్టార్ట్ అయితే లభించింది. ఇక ఈరోజు ఉదయం ఆటల నుంచి పబ్లిక్ మౌత్ టాక్ పాజిటివ్‌గా ఉండటంతో బుక్ మై షో యాప్ లో ఈ సినిమా బలంగా ట్రెండ్ అవుతోంది. అయితే సినిమాకు వస్తున్న రెస్పాన్స్‌ను చూసి చిత్ర యూనిట్ మీడియాతో ముచ్చటించి తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా సినిమా రిలీజ్‌కు ముందు తాను చాలా టెన్షన్ పడ్డానని హీరో వరుణ్ తేజ్ ఓపెన్‌గా వివరణ ఇచ్చారు. కానీ నిన్న రాత్రి ప్రీమియర్స్ నుంచి వస్తున్న టాక్ చూశాక తన మైండ్ చాలా రిలాక్స్ అయిందని అన్నారు. తన కెరీర్‌లో దాదాపు ఆరు ఏళ్ల గ్యాప్ తర్వాత మళ్లీ ఇంత పెద్ద సక్సెస్ చూడటం తనకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. థియేటర్లలో స్క్రీన్ మీద తన యాక్టింగ్‌కు జనాల నుంచి మంచి అప్లాజ్ వస్తోందని వరుణ్ తేజ్ చెప్పుకొచ్చారు. సినిమాలో ముఖ్యంగా కమెడియన్ సత్యతో కలిసి చేసిన కామెడీ సీన్స్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తున్నాయని టాక్ వస్తోంది. ఈ ట్రాక్ సినిమాకు బాగా ప్లస్ అయిందని ఆయన అన్నారు. అదే క్రమంలో సోషల్ మీడియాలో సీనియర్ ఎన్టీఆర్ గారిని ట్రోల్ చేశారంటూ వస్తున్న వార్తలపై డైరెక్టర్ మేర్లపాక గాంధీ నేరుగా స్పందిస్తూ అభిమానులకు ఒక క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. సినిమాలో కమెడియన్ సత్యతో చేయించిన ఇమిటేషన్ కేవలం ఆ సిట్యువేషన్ కి తగ్గట్టుగా సరదా కోసం డిజైన్ చేసింది మాత్రమేనని డైరెక్టర్ గాంధీ వివరణ ఇచ్చారు. అంతటి గొప్ప లెజెండరీ నటుడిని కించపరిచే ఉద్దేశం తమకు ఏమాత్రం లేదని చెప్పారు. కావాలని తప్పుగా చూపించాలనే ఆలోచన తమ టీమ్‌లో ఎవరికీ లేదని ఆయన వెల్లడించారు. ఎక్స్‌ప్రెస్ రాజా తర్వాత తనకు మళ్లీ దొరికిన బెస్ట్ కమర్షియల్ సక్సెస్ ఇదేనంటూ సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ఆయన స్పెషల్‌గా థాంక్స్ చెప్పారు. ఈ సినిమా విజయంతో తన కొడుకు వాయువ్ తేజ్ తనకు బాగా కలిసొచ్చాడని వరుణ్ తేజ్ ఈ మీట్‌లో ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. బాబు పుట్టిన తర్వాత బాక్సాఫీస్ దగ్గర ఇలాంటి ఒక సాలిడ్ హిట్ అందుకోవడం నిజంగా తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఇన్నాళ్లుగా సరైన సక్సెస్ కోసం ఎదురు చూస్తున్న తనకు ఈ రిజల్ట్ ఒక కొత్త ఎనర్జీ ఇచ్చిందని అన్నారు. ఇక సినిమా రిలీజ్ తర్వాత మెగాస్టార్ చిరంజీవి గారు కూడా తనతో ఫోన్లో మాట్లాడారని వరుణ్ తేజ్ ఈ సందర్భంగా వెల్లడించారు. సినిమాకు వస్తున్న పాజిటివ్ టాక్ గురించి తెలుసుకుని ఆయన దాదాపు అరగంట పాటు తనతో ముచ్చటించారని చెప్పారు. త్వరలోనే ఆయన కూడా సినిమా చూసి తన ఫీడ్ బ్యాక్ ఇస్తారని వరుణ్ ఆనందం వ్యక్తం చేశారు.

# 11న శ్రీ పంచముఖ ఆంజనేయుని సన్నిధిలో ఉచిత వైద్య శిబిరం



**విజయనగరం, (రాజధాని వార్తలు):** "శరీరమాద్యంఖలు ధర్మసాధనం" అంటారు పెద్దలు. ధర్మాన్ని ఆచరించాలన్నా, దైవాన్ని దర్శించి తరించాలన్నా ముందుగా ఈ దేహం ఆరోగ్యంగా ఉండటం అత్యంత ఆవశ్యకం. "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే నానుడిని అక్షరసత్యం చేస్తూ, "మానవ సేవే మాధవ సేవ" అన్న పరమోత్కృష్టమైన ధార్మిక చింతనను ఆచరణలో పెడుతూ ఒక అద్భుత ఘట్టానికి అంకురార్పణ జరిగింది. నాడు రామలక్ష్మణుల ప్రాణరక్షణకై ద్రోణగిరి నుండి ఏకంగా సంజీవని పర్వతాన్నే అవలీలగా పెకిలించుకువచ్చిన ఆపద్బాంధవుడు, భక్త సులభుడు అయిన ఆ వాయునందనుడి సన్నిధిలోనే... నేడు ఆర్తుల పాలిట 'సంజీవని' లాంటి ఉచిత వైద్య సేవలు అందనుండటం విశేషం. ఎన్ సి ఎస్ రోడ్డులో అత్యంత వైభవంగా కొలువుదీరిన శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి దివ్య సన్నిధానం ఇందుకు వేదికగా నిలవడం భక్తులకు సర్వత్రా హర్షదాయకం. సకల భవరోగాలను హరించే ఆ అంజనీపుత్రుని చల్లని నీడలో, దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ ఉదయం 9 గంటలకు ఒక మహా వైద్య యజ్ఞం ప్రారంభం కానుంది. ప్రాణదాతలైన వైద్యులను సాక్షాత్తూ దైవంగా భావించే ఆచారానికి అద్దం పడుతూ ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రముఖ కంటి వైద్యశాల 'శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి' వారి విశేష కృషితో ఉచిత నేత్ర వైద్య శిబిరం జరగనుంది. ప్రసిద్ధ 'కాశ్వి హాస్పిటల్' వారి సౌజన్యంతో జనరల్ మెడిసిన్ మరియు ఎముకల సంబంధిత వ్యాధులకు చెందిన నిష్ణాతులైన వైద్య ప్రముఖులు కూడా ఈ శిబిరంలో పాల్గొననున్నారు. రోగులను అత్యంత సావధానంగా పరీక్షించి, వారికి తగు వైద్య సలహాలు, అత్యుత్తమ సూచనలు అందించనున్నారు. ఇలాంటి ఒక మహత్తర దైవకార్యానికి సంబంధించిన ప్రచార కరపత్రాలను శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయ కమిటీ సభ్యులు అత్యంత భక్తిశ్రద్ధలతో, లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... "సాక్షాత్తూ ఆ మారుతి కృపాకటాక్షాలతో పాటుగా, వైద్య నారాయణుల నిస్వార్థ సేవలు ఒకేచోట మెండుగా లభించడం ఒక అరుదైన సువర్ణావకాశం. ఆపదలో ఉన్నవారిని ఆదుకునే ఈ సంజీవని లాంటి సదుపాయాన్ని నగర ప్రజలు, భక్తకోటి ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకుని తరించాలి" అని మనసారా కోరారు.

# ఉచిత నేత్ర వైద్య శిబిరంతో మెరుగైన వైద్య సేవలు

## - ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, రేవంత్ మిత్తిరెడ్డి










**మెరకముడిదాం, (రాజధాని వార్తలు):** మండల కేంద్రమైన మెరకముడిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్, అందత్వ నివారణ సంస్థ విజయనగరం వారి ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి విశాఖపట్నం వారి సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, రేవంత్ విలేకరులకు తెలియజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన ఈ శిబిరంలో కంటి సంబంధిత సమస్యలు ఉన్న రోగులను పరీక్షించారు. శంకర్ ఫౌండేషన్ ఆప్తమాలజిస్ట్ గంగాధర్ 71 మందికి పరీక్షలు నిర్వహించి 42 మందిని కేటరాక్ట్ సర్జరీకి ఎంపిక చేశారు. వీరందరినీ శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తీసుకొని వెళ్ళి ఆపరేషన్ చేసి, తిరిగి పంపించడం జరుగుతుందని ఆయన చెప్పారు.తనిఖీలు చేసుకోవడానికి వచ్చిన వారికి సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ వారు మందులు, కంటి చుక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పి హెచ్ సి మెడికల్ ఆఫీసర్ అజిత్ బాబు, సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షు, కార్యదర్శులు సాయికుమార్, రేవంత్ మిత్తిరెడ్డి, వర్మ, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, క్యాంప్ జూనియర్ మేనేజర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

# పొలంబడి గట్టు మీద చెట్టు కార్యక్రమాలు

**మక్కువ, (రాజధాని వార్తలు):** మండలంలో గల లోవర కండి గ్రామంలో వ్యవసాయ అధికారి చింతల భారతి ఆధ్వర్యంలో పొలంబడి మరియు గట్టుమీద చెట్టు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు వెంకట నాయుడు పొలంలో నారుమడి నుంచి నారును నేరుగా వ్యవసాయ పొలంలో విత్తునప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వ్యవసాయ అధికారి చింతల భారతి రైతులకు అవగాహన కల్పించారు. ఊడ్చేటప్పుడు నారును చివరి భాగంలో తుంచి నాటడం ద్వారా పీక పురుగు వరి పైరుకు రాకుండా ఉంటుందని అలాగే ఉత్తేటప్పుడు తగినంత దూరంగా నాటుకోవాలని తద్వారా అధిక పిలకలు పెట్టి మంచి దిగుబడి సాధించవచ్చును తెలియజేశారు. అలాగే వరి చేనులో నీటి యాజమాన్యం పద్ధతులు పాటించాలని మొక్కకు రెండు సెంటీమీటర్లు నీరు ఉంటే సరిపోతుందని. వరి చేను విత్తినప్పుడు వరుసు కు వరుసకు మధ్య దూరాన్ని తగినంత ఉంచుకోవాలని అలా అయితే గాలి వెలుతురు సరిగా ప్రసరించడం ద్వారా అనేక తెగులు బారి నుంచి చేను కాపాడుకోవచ్చు అని అన్నారు తద్వారా నీటి బుడగలు ఏర్పడకుండా ఉండి అత్యధిక పిలకలు పెడుతుందని మంచి దిగుబడి వస్తుందని తెలియజేశారు. వరి గట్లపై పళ్ళ మొక్కలు కూరగాయలు పండించడం ద్వారా రైతుకు మంచి ఆరోగ్యకరమైన ఆహారమే అందటమే కాకుండా అదనపు ఆదాయం కూడా వస్తుందని తెలియజేశారు.




# పిల్లల సంక్షేమం, ఆహార భద్రతలో రాజీకి తావులేదు బి.కాంతారావు

## - లోపాల సవరణకు వెంటనే చర్యలు తీసుకోవాలి : ఏ.పీ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు బుధవారం విజయనగరం జిల్లాలోని గరివిడి మండలంలో సుడిగాలి పర్యటన నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును క్షుణ్ణంగా పరిశీలిం చారు. అంగన్‌వాడీ కేంద్రం, కేజీబీవీ, జెడ్పీ హైస్కూల్, రెండు చౌక ధరల దుకాణాలను తనిఖీ చేసి సంబంధిత రికార్డులను పరిశీలించి విద్యార్థులు, లబ్ధిదారులతో మాట్లాడారు. మొదట గరివిడి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన విద్యుత్ మరమ్మతులు పూర్తి చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే క్యారెట్ నిల్వలను సక్రమంగా నిర్వహించకపోవడం గమనించి, వెంటనే సరిచేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గరివిడి కేజీబీవీ ని సందర్శించి విద్యార్థినులతో ముచ్చటించారు. వారికి అందుతున్న ఆహారం, వసతి, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. పరిశీలనలో గుడ్ల పంపిణీ వివరాలు చెక్కు రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడం, అరటి పండ్లు బరువు నిర్దేశిత 100 గ్రాములకు బదులుగా సుమారు 80 గ్రాములుగా ఉండటం గమనించి, వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. తదుపరి బొండపల్లి జెడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. బొండపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల కోసం కేటాయించిన 6 కిలోల కందిపప్పులో కేవలం 3 కిలోలే నిల్వ ఉండటాన్ని గుర్తించి దీనిపై జిల్లా విద్యాశాఖాధికారిని ఫోన్‌లో సంప్రదించి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

అలాగే గరివిడిలోని రెండు చౌక ధరల దుకాణాలను తనిఖీ చేసిన ఫుడ్ కమిషన్ సభ్యుడు, ఫెయిర్ ప్రైస్ షాపుల అధికార ధ్రువీకరణ పునరుద్ధరణ సర్టిఫికెట్లు గడువు ముగిసినా రెన్యువల్ చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక దుకాణంలో 45 కిలోల బియ్యాన్ని ఒకే ప్లాస్టిక్ సంచిలో నిల్వ చేయడం గమనించి నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఆదే శించారు. అవసరమైన మెమోలు జారీ చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా సంక్షేమ పథకాల అమలులో నాణ్యత, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, విద్యార్థులు, చిన్నారులకు అందించే ఆహారంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావులేదని బి. కాంతారావు స్పష్టం చేశారు. తనిఖీల్లో గుర్తించిన లోపాలను వెంటనే సరిచేసి నివేదిక సమర్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా పౌర సరఫరాల అధికారి మురళీధర్, జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్య నాయుడు, ఐసీడీఎస్ అధికారులు, సంబంధిత శాఖలా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మక్కువ పోలీస్ ఆధ్వర్యంలో విజయవంతంగా హరిత ఆంధ్ర కార్యక్రమం





**మక్కువ, (రాజధాని వార్తలు):** మండలంలో నేడు పోలీసు శాఖ వారి ఆధ్వర్యంలో మిషన్ హరిత ఆంధ్ర విజయవంతంగా జరిగింది. దీనిలో భాగంగా మక్కువ జిల్లా పరిషత్ పాఠశాల మరియు వైయస్ వలస ఆశ్రమ పాఠశాల అలాగే అనస భద్ర ఏకలవ్య గురుకుల పాఠశాలలో మొక్కలను నాటే కార్యక్రమం పోలీసు వారు నిర్వహించారు. అంతేకాకుండా వివిధ రకాల మొక్కలను పంపిణీ కార్యక్రమం కూడా చేపట్టారు. ఈ సందర్భంగా మక్కువ ఎస్ఐ ఎం వెంకటరమణ మాట్లాడుతూ పర్యావరణానికి కాపాడే బాధ్యత మనందరిపై ఉందని హరిత ఆంధ్ర కార్యక్రమాన్ని ఒక బాధ్యతగా ప్రతి ఒక్క విద్యార్థి తీసుకుని మొక్కలను సంరక్షించాలని తద్వారా వాతావరణ సమతూల్యత దెబ్బతినకుండా చూసే బాధ్యత మనందరిపై ఉందని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్కూళ్లకు చెందిన అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ఎస్సై వెంకటరమణ మరియు ఏఎస్ఐ శ్రీనివాసరావు వారితో పాటు వారి సిబ్బంది ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు.

# అవయవ దానం పునర్జన్మనిస్తుంది

## - చెన్నై గ్లెనిగల్ హాస్పిటల్స్ డాక్టర్ రజనీకాంత్




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన పెంచుకోవాలని అవయవ దానం ద్వారా మరొక మనిషికి పునర్జన్మను ప్రసాదించవచ్చని ప్రముఖ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ (చెన్నై గ్లెనిగల్ హాస్పిటల్స్) డాక్టర్ పి వి రజనీకాంత్ పేర్కొన్నారు.

గురువారం నాడు గ్లెనిగల్ హాస్పిటల్స్ నెల్లూరు బ్రాంచికి విచ్చేసిన డాక్టర్ రజనీకాంత్ మాట్లాడుతూ ఆగస్టు నెల 13వ తేదీన అవయవ దాన దినోత్సవం సందర్భంగా పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని అవయవదానంపై అందరూ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. చాలామంది రోగులు అవయవ దానం కోసం ఎదురు చూస్తున్నా రని, బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తినుంచి సేకరించిన, గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు తదితర ఐదు అవయవాలను అవసరమైన వారికి మార్పిడి చేసి వారికి పునర్జన్మను ఇవ్వవచ్చని డాక్టర్ రజనీకాంత్ పేర్కొన్నారు. భారత దేశంలో అవయవ దానం పై అవగాహన చాలా తక్కువగా ఉం దని, అమెరికా, లండన్‌లాంటి దేశాల్లో ఈ అవయవ దానంపై అవగాహన బాగా ఉందని భారత దేశంలో కూడా అవయవ దానంపై అవగాహన పెంపొందించుకొని మరొకరికి పునర్జన్మను ఇవ్వాలని డాక్టర్ రజనీకాంత్ కోరారు. ఈ కార్యక్రమంలో డా. రజనీకాంత్‌తో పాటు గ్లెనిగల్ హాస్పిటల్స్ మార్కెటింగ్ మేనేజర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 9వ తేదీ నెల్లూరు జిల్లా పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని స్థానిక ప్రెస్ క్లబ్‌నందు జరిగిన విలేకరుల సమావేశంలో నెల్లూరు జిల్లా శ్రీ పద్మశాలి సేవా సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు జానపాటి రామసుబ్బయ్య విలేకరులతో మాట్లాడుతూ ఈనెల తొమ్మిదవ తేదీ అనగా ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు మైపాడు రోడ్డులోని డి జి పి కళ్యాణమండపం నందు నెల్లూరు జిల్లాలోని పద్మశాలి విద్యార్థిని విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు వారి తల్లిదండ్రులకు ప్రోత్సాహకాలు అందజేయడం జరుగుతుందని తెలియజేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ప్రశాంతి రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జివి నాగేశ్వరరావు మాజీ ఎమ్మెల్సీ బూదాటి, రాదయ్య, నెల్లూరు జిల్లా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొంటారని కావున నెల్లూరు జిల్లా పద్మశాలి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో విచ్చేసి జయప్రదం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

# పిల్లల సంక్షేమం, ఆహార భద్రతలో రాజీకి తావులేదు బి.కాంతారావు

**- లోపాల సవరణకు వెంటనే చర్యలు తీసుకోవాలి : ఏ.పీ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు**





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు బుధవారం విజయనగరం జిల్లాలోని గరివిడి మండలంలో సుడిగాలి పర్యటన నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును క్షుణ్ణంగా పరిశీలిం చారు. అంగన్‌వాడీ కేంద్రం, కేజీబీవీ, జెడ్పీ హైస్కూల్, రెండు చౌక ధరల దుకాణాలను తనిఖీ చేసి సంబంధిత రికార్డులను పరిశీలించి విద్యార్థులు, లబ్ధిదారులతో మాట్లాడారు. మొదట గరివిడి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన విద్యుత్ మరమ్మతులు పూర్తి చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే క్యారెట్ నిల్వలను సక్రమంగా నిర్వహించకపోవడం గమనించి, వెంటనే సరిచేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశిం చారు. అనంతరం గరివిడి కేజీబీవీ ని సందర్శించి విద్యార్థినులతో ముచ్చటించారు. వారికి అందుతున్న ఆహారం, వసతి, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. పరిశీలనలో గుడ్ల పంపిణీ వివరాలు చెక్కు రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడం, అరటి పండ్ల బరువు నిర్దేశిత 100 గ్రాములకు బదులుగా సుమారు 80 గ్రాములుగా ఉండటం గమనించి, వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. తదుపరి బొండపల్లి జెడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. బొండపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల కోసం కేటాయించిన 6 కిలోల కందిపప్పులో కేవలం 3 కిలోలే నిల్వ ఉండటాన్ని గుర్తించి దీనిపై జిల్లా విద్యాశాఖాధికారిని ఫోన్‌లో సంప్రదించి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

అలాగే గరివిడిలోని రెండు చౌక ధరల దుకాణాలను తనిఖీ చేసిన ఫుడ్ కమిషన్ సభ్యుడు, ఫెయిర్ ప్రైస్ షాపుల అధికార ధ్రువీకరణ పునరుద్ధరణ సర్టిఫికెట్లు గడువు ముగిసినా రెన్యువల్ చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక దుకాణంలో 45 కిలోల బియ్యాన్ని ఒకే ప్లాస్టిక్ సంచిలో నిల్వ చేయడం గమనించి నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఆదే శించారు. అవసరమైన మెమోలు జారీ చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా సంక్షేమ పథకాల అమలులో నాణ్యత, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, విద్యార్థులు, చిన్నారులకు అందించే ఆహారంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావులేదని బి. కాంతారావు స్పష్టం చేశారు. తనిఖీల్లో గుర్తించిన లోపాలను వెంటనే సరిచేసి నివేదిక సమర్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా పౌర సరఫరాల అధికారి మురళీధర్, జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్య నాయుడు, ఐసీడీఎస్ అధికారులు, సంబంధిత శాఖలా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో "స్వచ్ఛ రథం" పై అవగాహన

**- గ్రామీణ ప్రాంతాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే స్వచ్ఛరథం పథకం ముఖ్య ఉద్దేశం : పంచాయతీ కార్యదర్శి జగదీష్**







**గజపతినగరం, (రాజధాని వార్తలు):** స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పురిటిపెంట పంచాయతీ కార్యదర్శి జగదీష్ స్వచ్ఛర థంపై పాఠశాల విద్యార్థినులకు గురువారం అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడానికి చెత్త నుంచి సంపద సూత్రం ఆధారంగా ప్రవేశపెట్టిన వినూత్న కార్టర్ (మార్పిడి) విధానమే స్వచ్ఛ రథం పథకం అని ఆయన విద్యార్థినులకు వివరించారు. ఈ పథకం ద్వారా గ్రామాలలో ప్లాస్టిక్, కాగితం, ఇనుప వ్యర్థాలు వంటి పొడి చెత్తను ఇచ్చి దానికి సమానమైన విలువగల నిత్యా వసర వస్తువులు లేదా పాఠశాల విద్యార్థులైతే పుస్తకాలు పొంద వచ్చునని కార్యదర్శి జగదీష్ తెలియజేశారు. బహిరంగ ప్రాంతా లలో చెత్త వేయడాన్ని అరికట్టి తద్వారా గ్రామాలలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం అని కార్య దర్శి జగదీష్ విద్యార్థులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలికో న్నత పాఠశాల ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు మంగాదేవి, తెలుగు భాష ఉపాధ్యాయు రాలు రామలక్ష్మి, తదితర ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజా గాయకుడు గద్దర్ వర్ధంతి





**అమలాపురం, (రాజధాని వార్తలు):** ప్రజా యుద్ధనౌక, విప్లవ ప్రజా గాయకుడు గద్దర్ (గుమ్మడి విఠల్ రావు) వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. విసికె పార్టీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ బొంతు రమణ ఆధ్వర్యంలో అమలాపురం గడియారం స్తంభం సెంటర్‌లో ప్రజాగాయకుడు గద్దర్‌కు ఘనంగా నివాళు లర్పించారు. పాటను ఆయుధంగా మార్చి బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. చుండూరులో అగ్ర కులస్తులతో సమానంగా ఉంటూ ఆధిపత్యం ప్రశ్నిస్తున్నారని అగ్ర కుల దురహంకారంతో దళితులని ఊచకోతకు గురి చేసి దాడి చేసిన వివిధ ఘటనల్లో 11 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిందన్నారు. అది జాతీయ స్థాయిలో ఉద్యమం రేకెత్తించిదని ఆయన రమణ అన్నారు. హత్యా కాండకు కారకులకు నేటికీ శిక్ష పడకపోవడం విచారకరమని, వారి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ నివాళు లు అర్పించారు. అదేవిధంగా ప్రజ యుద్ధనౌక గద్దర్ చేసిన సేవలు చిరస్మరణీయమని, ప్రజాగాయకుడు గా ప్రజలను చైతన్య పరుస్తూ ఎన్నో ఉద్యమాలు చేసి ప్రజల పక్షాన నిలిచిన నాయకుడు గద్దర్ అని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో వి.సి.కె పార్టీ జిల్లా అధ్యక్షులు మెండి డేవిడ్ అంబేద్కర్, రిపబ్లికన్ పార్టీ నాయకులు ఈ.వి.వి. సత్యనారాయణ, సాపే రమేష్, వాకపల్లి హరీష్, గోసంగి మధు, జల్లి అజయ్ కుమార్, నక్కా రామ్ కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ కేంద్రంలో జన్ – జి రిలే నిరాహార దీక్షలు

**- మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, యువనేత బొత్స గురునాయుడు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు**







**గజపతినగరం, (రాజధాని వార్తలు):** నియోజకవర్గ కేంద్రంలో డీఎస్సీ – 2025 నియామక ప్రక్రియ జరిగిన విధానంపై నిరసన వ్యక్తం చేస్తూ వైఎస్ఆర్సిపి శ్రేణులు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆధ్వర్యంలో జన్ – జి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించాయి. ఉపాధ్యాయ నియామక ప్రక్రియ డీఎస్సీ – 2025లో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య డిమాండ్ చేశారు. గురువారం నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరం నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని బొత్స ప్రారంభించారు. మొదటి రోజు దీక్షలో పాల్గొన్న దత్తిరాజేరు, జామి మండలాలకు చెందిన యూత్ విభాగం కన్వీనర్లు దత్తి చిరంజీవి, పాండ్రంకి రవికుమార్‌లతో పాటు 50 మంది యూత్ విభాగం సభ్యులకు బొత్స అప్పల నరసయ్య పూలదండలు వేసి దీక్షలో కూర్చుండబెట్టి వారికి మద్దతుగా నిలిచారు. రిలే నిరాహార దీక్షలు జరపడానికి గల కారణాలను వివరిస్తూ, డీఎస్సీ 2025 లో ఎన్నో జరిగాయని వాటిపై సి.బి.ఐతో తక్షణమే దర్యాప్తు చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కూటమీ ప్రభుత్వం వైకాపా పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తుందని విమర్శించారు. స్పోర్ట్స్ కోటా కింద భర్తీ చేసిన 400 వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు అమ్ముకుని సొమ్ము చేసుకు న్నారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు సైతం తమ అధినేత జగన్మోహన్ రెడ్డి చూపించిన ఈ ప్రభుత్వానికి చలనం లేదని బొత్స విమర్శించారు. నిరుద్యోగ యువతను పూర్తిగా ఈ ప్రభుత్వం మోసం చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా స్పోర్ట్స్ కోటా కింద ఎటు వంటి పరీక్ష నిర్వహించకుండా నేరుగా ఉద్యోగాలు కల్పించడం దారుణమని బొత్స అన్నారు. ఈ రెండున్నర ఏళ్ల పాలనలో కూటమి ప్రభుత్వం 3 లక్షల 63 వేల కోట్ల రూపాయలు అప్పు చేసిందని, ఈ డబ్బు ఎవరి జోబుల్లోకి వెళ్లిందని ఆయన ప్రశ్నిం చారు. తమ ప్రభుత్వ హయాంలో అప్పు చేసిన ప్రతి పైసాను అభివృద్ధి, ప్రజాసంక్షేమానికి ఖర్చు చేశామని బొత్స అప్పలనర సయ్య అన్నారు. రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, ఎన్నికల హామీలు గాలికి వదిలేసారని, మరి అప్పులు చేసిన డబ్బు ఏమి చేశారని బొత్స ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బొత్స అప్పల నరసయ్య తనయుడు, పార్టీ యువనేత బొత్స సాయి గురునాయుడు, మండల నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ, జడ్పీటిసి గార తవుడు, జిల్లా వైఎస్ఆర్సిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్, జడ్పీటిసిలు రౌతు రాజేశ్వరి, ఎంపీపీలు సింహాద్రి అప్పలనాయుడు, ఉత్త రాంధ్ర ఉపాధ్యాయ కో – ఆర్డినేటర్ బూడి వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షులు పల్లి సంజీవరావు, కృష్ణార్జున, గొర్లె రవికుమార్, మాజీ జెడ్పీటిసి మంత్రి అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ కంది తిరుపతి నాయుడు, యూత్ విభాగం నియోజకవర్గం కన్వీనర్ కె.పైడిపి నాయుడు, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు బెల్లాన త్రినాధరావు, కర్రీ రామునాయుడు, కడుబండి రమేష్, సంజీవ రావు, సత్యరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఆ బదిలీలను ఆపండి

**- జిల్లా కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించన వీఆర్వోలు**



**అమలాపురం, (రాజధాని వార్తలు):** నో –పోస్ట్ వీఆర్వోలు (పోస్టులు లేని (గ్రామ రెవెన్యూ అధికారులు) తమ బదిలీలను వెంటనే ఆపాలని కోరుతూ అమలాపురం పట్టణంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం డిఆర్‌ఓకి వినతిపత్రం సమర్పిం చారు. పరిపాలనా సమస్యలు తలెత్తకుండా స్పష్టమైన మార్గద ర్శకాలు వచ్చే వరకు బదిలీ ప్రక్రియను నిలిపివేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. డిప్యూషన్ పేరుతో అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన 8 మంది గ్రేట్ విఆర్‌ఓలను విజయవాడ పి జి ఆర్ ఎస్‌కు బదిలీ చేసేందుకు జరు గుతున్న ప్రయత్నాలను నిలుపుదల చేయాలని ఏపీ రెవెన్యూ జేఏసీ చైర్మన్ విఎస్ దివాకర్, జిల్లా అసోసి యేషన్ అధ్యక్షుడు మద్దాల బాపూజీ కోరారు. కలెక్టరేట్‌లో వీఆర్వోలతో కలిసి డిఆర్‌ఓ ఏవోకు తమ సమ స్యలను వివరించారు. జిల్లాలో వి ఆర్వోలు రీసర్వే, జనగణన, ఎన్ని కల విధులలో బిజీగా ఉన్నారని ఇటువంటి పరిస్థితుల్లో బదిలీలను రద్దు చేయాలని అధికారులను బాపూజీ కోరారు. విజయవాడ డిప్యూటేషన్ బదిలీలపై పునర్ పరిశీలన చేస్తానని కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు వినోద్. పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, గోవర్ధన్ భరత్, షేక్ బేబీ షాహిద, పెచ్చెట్టి కనక మహాక్ష్మీ, ఎస్ నర్మదా, చొల్లంగి శ్రీలక్ష్మి, దార కమల, గుత్తుల వరలక్ష్మి, టి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్లానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# మధ్యప్రదేశ్ పర్యాటక బోర్డు మరియు టాటా స్ట్రైవ్ మధ్య అవగాహన ఒప్పందంపై ముఖ్యమంత్రి డాక్టర్ యాదవ్ సంతకాలు

## - యువతకు వేలాది ఉపాధి మరియు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించే భాగస్వామ్యం - పర్యాటక మరియు ఆతిథ్య రంగాన్ని బలోపేతం చేసే నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం




**(రాజధాని వార్తలు):** మధ్యప్రదేశ్ పర్యాటక బోర్డు (పీ్టడీ) మరియు టాటా స్ట్రైవ్ (టాటా కమ్యూనిటీ ఇనిషియేటివ్స్ ట్రస్ట్) మధ్య పరస్పర అంగీకారంతో పొడిగించే నిబంధనతో కూడిన ఒక ముఖ్యమైన రెండేళ్ల అవగాహన ఒప్పందంపై సంతకాలు జరగడాన్ని ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ వీక్షించారు. ఈ అవగాహన ఒప్పందంపై మధ్యప్రదేశ్ పర్యాటక బోర్డు డైరెక్టర్ (నైపుణ్యం) డి.పి. సింగ్ మరియు టాటా స్ట్రైవ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అమేయ వంజరి సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ పర్యాటక బోర్డు కార్యదర్శి, పర్యాటక శాఖ మరియు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఇళయరాజా టి పాల్గొన్నారు. ఈ భాగస్వామ్యం యొక్క ముఖ్య ఉద్దేశ్యం, గ్రామీణ హోమ్‌స్టే నిర్వాహకుల ఆదాయాన్ని పెంచడం, ప్రపంచ స్థాయి ఆతిథ్య ప్రమాణాలకు అనుగుణంగా సేవలను అభివృద్ధి చేయడం, మరియు స్థానిక యువతకు కొత్త ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడం. ఈ కార్యక్రమం ద్వారా ప్రధానంగా లబ్ధి పొందేది గ్రామీణ హోమ్‌స్టే నిర్వాహకులు, స్థానిక యువత మరియు పర్యాటక సేవా ప్రదాతలు. ఈ సహకారం, మధ్యప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న హోటళ్లు మరియు ప్రైవేట్ ఆతిథ్య సంస్థలకు నైపుణ్యం గల మానవ వనరుల లభ్యతను కూడా సులభతరం చేస్తుంది. దీని ద్వారా ఆతిథ్య మరియు పర్యాటక రంగంలో వేలాది ఉపాధి మరియు స్వయం ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని, తద్వారా రాష్ట్ర గ్రామీణ పర్యాటక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని భావిస్తున్నారు. ఈ అవగాహన ఒప్పందం (వీశీఖ) మొదటి దశలో, గ్రామీణ పర్యాటక మరియు హోమ్‌స్టే వ్యవస్థతో సంబంధం ఉన్న సుమారు 1,000 మంది భాగస్వాములకు 'రికగ్నిషన్ ఆఫ్ ప్రయర్ లెర్నింగ్' ధృవీకరణ పత్రం మరియు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వబడుతుంది. ఈ శిక్షణా కార్యక్రమంలో హోమ్‌స్టే నిర్వహణ, డిజిటల్ బుకింగ్ మరియు ఆన్‌లైన్ ట్రావెల్ ఏజెన్సీ ప్లాట్‌ఫారమ్‌ల వినియోగం, ఫ్రంట్ ఆఫీస్ కార్యకలాపాలు, హౌస్‌కీపింగ్, స్థానిక వంటకాలు, ఆహార మరియు పానీయాల సేవలు, టూరిస్ట్ గైడింగ్, భద్రత, పరిశుభ్రత, సుస్థిర పర్యాటకం మరియు రెవెన్యూ మేనేజ్‌మెంట్ వంటి ఆచరణాత్మక అంశాలు ఉంటాయి. తదుపరి దశలలో, MPSTDC హోటళ్లు మరియు రిసార్ట్‌ల సిబ్బందికి పునశ్చరణ శిక్షణ ఇవ్వబడుతుంది, అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యువతకు పరిశ్రమ ఆధారిత ఆతిథ్య నైపుణ్యాలు నేర్పించబడతాయి. ఈ ఒప్పందం రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా ప్రయోజనకరం, ఎందుకంటే మధ్యప్రదేశ్ పర్యాటక బోర్డు శిక్షణ కోసం ఎలాంటి ఖర్చు భరించదు. శిక్షకుల పూర్తి ఖర్చు, వారి పారితోషికం మరియు శిక్షణా మాడ్యూళ్ల అభివృద్ధిని టాటా స్ట్రైవ్ భరిస్తుంది, అయితే MPTB కేవలం శిక్షణా వేదికలతో పాటు శిక్షకులకు మరియు శిక్షణార్థులకు వసతి, భోజనాన్ని మాత్రమే అందిస్తుంది. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత, పాల్గొన్న వారందరూ IHCL-టాటా స్ట్రైవ్ మరియు మధ్యప్రదేశ్ టూరిజం బోర్డ్ నుండి పరిశ్రమచే గుర్తింపు పొందిన ఉమ్మడి ధృవీకరణ పత్రాన్ని అందుకుంటారు. ఇది వారి వృత్తిపరమైన విశ్వసనీయతను పెంచి, పర్యాటక మరియు ఆతిథ్య రంగంలో ఉపాధి మరియు వ్యవస్థాపకత అవకాశాలను మెరుగుపరుస్తుంది.

# ఆగస్టు 23న విజయవాడలో 'సృజనోత్సవం' సాహిత్య సాంస్కృతిక సందడి

## - కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ




**విజయవాడ, (రాజధాని వార్తలు):** సాంస్కృతిక సారథులను ప్రోత్సహిస్తూ, భాష సంస్కృతులను మరింత మెరుగు పరిచే దిశగా మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆగస్టు 23న ఆదివారం విజయవాడలో జరపబోతున్న 'సృజనోత్సవం' సాహిత్య సాంస్కృతిక సందడి కార్యక్రమం విజయవంతం కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమ కరపత్రాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వాహకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం డా.జి.లక్ష్మీశ మాట్లాడుతూ కవుల్ని, కళాకారుల్ని ప్రోత్సహించే 'సృజనోత్సవం' వంటి సాహిత్య, సాంస్కృతిక సందళ్ళు సమాజాన్ని జాగృతం చేయడంలో ఎంతో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. వాడుక భాష పితామహుడు గిడుగు రామమూర్తి జయంతిని ముందుగానే జరపతల పెట్టడం అభినందనీయమన్నారు. సాహిత్య సాంస్కృతిక వికాసం కోసం, భాషాభివృద్ధి కోసం చేసే ఇలాంటి కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం నుండి సహకారం అందిస్తామని అన్నారు. మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీ మాట్లాడుతూ భాష, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకోసం జరపబోతున్న ఈ కార్యక్రమంలో చిన్నారుల నృత్యాలు, మినీ స్కిట్స్, కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలు, గజల్ గానం, గిడుగు సేవా పురస్కారాలు వుంటాయన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డి.జి.లక్ష్మీశ ప్రారంభిస్తారన్నారు. సుప్రసిద్ధ సాహితీవేత్తలు కార్యక్రమానికి హాజరవుతారన్నారు. ఉదయం 10 గంటలకు 'కళాక్షేత్ర ది డాన్స్ అకాడమీ' నిర్వాహకులు ఎ.గీత, పి.మౌనిక శిష్యబృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. హాజరైన కవులు, కళాకారులందరికీ మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశామన్నారు. శాలువా, జ్ఞాపికతో సత్కారం వుంటుందన్నారు. ఇప్పటికే కవులు, కళాకారులు తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. కవి సమ్మేళనం కోసం 83329 03156 నెంబరులో సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సలహాదారుడు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, కార్యక్రమ పర్యవేక్షకుడు చొప్పా రాఘవేంద్రశేఖర్ పాల్గొన్నారు.

# ఆర్టీసీలో ఉన్న ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

**గూడూరు, (రాజధాని వార్తలు):** ఏపీఎస్ ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేసి ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగ సంఘాల జేఏసీ కన్వీనర్ మురళీమోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గూడూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ మురళీ మోహన్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు తక్కువ జీతాలతో అధిక పని ఒత్తిడిలో విధులు నిర్వర్తిస్తున్నారని ఆయన అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే శ్రీశక్తి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరిగిందని, అయితే అందుకు అనుగుణంగా ఒక్క కొత్త బస్సును కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. అదనపు సిబ్బందిని నియమించకపోవడంతో ప్రస్తుతం ఉన్న ఉద్యోగులపైనే పనిభారం పెరిగిందన్నారు. విద్యుత్ బస్సుల కొనుగోలు, నిర్వహణ బాధ్యతలను పూర్తిగా ఆర్టీసీకే అప్పగించాలని, ప్రైవేటు ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో మూసివేసిన డిపోలను తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ప్రసాద్, పంటయ్య, గూడూరు డిపో నాయకులు ప్రవీణ్, శ్రీనివాసులు, గౌస్, నారాయణ, శ్రీధర్, శ్రీ కళ, రఘు, భాస్కర్, రమేష్ తదితర ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan